కూతురి అప్పగింతలు చేస్తూ

కుప్పకూలిన తల్లి

- గుండెపోటుతో కన్నుమూత
- ఉదయం పెళ్లి.. సాయంత్రం విషాదం
- కామేపల్లి మండలం అబ్బాసుపురంలో ఘటన



కల్యాణి(ఫైల్)

7



ఖమ్మం చర్చికాంపౌండ్‌లోని ముత్యాలమ్మ ఆలయంలో బోనాల సందడి

బోనమెత్తిన జనం..

శ్రావణమాస చివరి ఆదివారం కావడంతో ప్రజలు గ్రామదేవతలకు బోనాలు సమర్పించి.. మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో ఇరు జిల్లాల్లోని ముత్యాలమ్మ, పెద్దమ్మ, మైసమ్మ తదితర అమ్మవార్ల ఆలయాల్లో కోలాహలం కనిపించింది.



నాటు కోడి కిలో

@700

ఖమ్మంలో బోనాల సందడితో డిమాండ్

అసలే ఆదివారం.. అది కూడా శ్రావణమాసం చివరి ఆదివారం. గ్రామదేవతలకు బోనాల సమర్పణకు దాదాపు చివరి రోజు కావడంతో నాటు కోళ్ల ధరలు ఆకాశాన్నంటాయి. ఖమ్మంలో కిలో నాటు కోడి రూ.700 ల నుంచి రూ.750 వరకు పలకడంతో ప్రజలు బెంబేలెత్తిపోయారు. సాధారణ రోజుల్లో కిలో రూ.450 నుంచి రూ. 500ల వరకు ఉంటుండగా.. శ్రావణ మాసం చివరి ఆదివారం బోనాల నేపథ్యంలో రూ.700కుపైనే అమ్మడం విశేషం. ఇదిలా ఉండగా బ్రాయిలర్ కోడి లైవ్ కిలో రూ. 150 నుంచి రూ.170 వరకు పలికింది.

- ఖమ్మం మార్కెట్, ఆంధ్రజ్యోతి



ఏపీ వైపు కూలిన కరకట్ట రక్షణ గోడ

ఇంకెంతకాలం?

- గోదావరి కరకట్ట రక్షణపై కానరాని పట్టింపు
- చర్యలపై తెలుగు రాష్ట్రాల నిర్లక్ష్యం
- భద్రాచలం ఎస్ఈ లేఖతో ఇటీవల స్పందించిన ఏపీ అధికారులు
- ఎలివేటెడ్ రోడ్డు నిర్మాణానికి అనుమతులు ఇంకెప్పుడు?

భద్రాచలం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఏటా వర్షాకాలం సీజన్‌లో భద్రాచలం నదీ పరివాహక ప్రాంత వాసులను గోదావరి వరదలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. ముఖ్యంగా భద్రాచల పట్టణానికి గోదావరి ముంపు నుంచి శాశ్వత పరిష్కారం కోసం గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కరకట్టలు నిర్మించారు. ఈ కరకట్టల నిర్వహణ, రక్షణ చర్యలపై ప్రస్తుత తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఉదాసీనంగా వ్యవహరిస్తుండటంతో భద్రాచలంతో పాటు సరిహద్దున ఉన్న ఏపీలోని యటపాకకు ముంపు ప్రమాదం పొంచి ఉంది. తెలుగు రాష్ట్రాల సరిహద్దుల్లోని గోదావరి వరద కరకట్ట రక్షణ గోడ కూలినా ఏపీ అధికారుల్లో చలనం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంపై ఏపీలోని నీటిపారుదల శాఖ ధవళేశ్వరం కార్యనిర్వహణ అధికారికి గతంలో లేఖ రాసినా స్పందన రాలేదు. దాంతో సత్వరమే క్షేత్రస్థాయిలో పరిశీలించి పనులు చేపట్టాలంటూ ధవళేశ్వరం ఎస్ఈకి ఇటీవల భద్రాచలం నీటిపారుదల శాఖ ఎస్ఈ లేఖ రాశారు. ఈ క్రమంలో నాలుగు రోజుల క్రితం ఏపీకి చెందిన నీటి పారుదల శాఖ డీఈ, ఏఈలు వచ్చి స్థానిక నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి ఇందుకు సంబంధించి పనులు చేపట్టేందుకు అంచనాలు రూపొందిస్తామని స్థానిక తెలంగాణ అధికారులకు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక నీటిపారుదల శాఖ అధికారులతో భవిష్యత్తులో కరకట్ట నిర్వహణ ఏవిధంగా చేపట్టాలనే దానిపై చర్చించారు. ఇదిలా ఉండగా మరో వైపు భద్రాచలం కరకట్ట పై భాగంలోని సీసీ రహదారి భారీగా బీటలు వారడంతో పాటు రక్షణ గోడ ఒరిగిపోతుండటం ఆందోళన కలిగించే

(మిగతా 6వ పేజీలో)

రెండేళ్లయినా పూర్తికాని 'ఎలివేటెడ్' పనులు

విజయవాడ-జగదల్‌పూర్ జాతీయ రహదారిలో భద్రాచలంలోని శివారులో కరకట్ట మిగులు పనులను పూర్తి చేసేదానిలో భాగంగా ఎలివేటెడ్ రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉంది. అయితే ఇప్పటికే రెండేళ్లు కావస్తున్నా ఇందుకు సంబంధించిన పనులు ఇంకా పూర్తి కాలేదు. జాతీయ రహదారిపై ఫ్లై ఓవర్ మాదిరిగా ఎలివేటెడ్ రోడ్డు నిర్మాణం చేపట్టడానికి సాంకేతికపరమైన అనుమతులు రాకపోవడమే కారణమని తెలుస్తోంది. స్థానిక నీటిపారుదల శాఖ అధికారులు సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్(సీడీవో) మ్యాపులను ఆమోదం కోసం పంపగా వాటికి ఆమోదం తెలిపినట్టు సమాచారం. కాగా ఇందుకు సంబంధించి అధికారిక ఆమోదం పొందాల్సి ఉంది. మ్యాపులు ఆమోదం పొందిన అనంతరం జాతీయ రహదారుల శాఖ గ్రీన్‌సిగ్నల్ కోసం పంపనున్నట్టు తెలుస్తోంది. అనంతరం సుమారు రూ.70కోట్లతో ఎలివేటెడ్ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. 700 మీటర్ల మిగులు కరకట్ట పనుల్లో భాగంగా ఈ పనులు పూర్తి కావాలంటే మరో ఏడాది పైనే పట్టే పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి.



రూపుదిద్దుకుంటున్న

ఓటర్ల జాబితా

- పంచాయతీల్లో సిద్ధం చేస్తున్న అధికారులు

7

దర్బారు సేవలో ఆధిపత్య పోరుపై..

ఈవో సీరియస్!

చర్చనీయాంశమైన 'ఆంధ్రజ్యోతి' కథనం



దర్బారు సేవ నిర్వహిస్తున్న దృశ్యం

రామయ్య దర్బారు సేవలో

ఆధిపత్య పోరు!

6

'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం

మరో 15మందికి అస్వస్థత



- అల్పాహారం తిని ఆస్పత్రి పాలైన కల్లూరు గిరిజన ఆశ్రమ విద్యార్థినులు
- రెండువారాల్లో మరో సారి ఘటన
- విచారణ నిర్వహించిన తహసీల్దార్

అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

వివరాలు : 6లో

పదిహేను రోజుల క్రితం అల్పాహారం తిని కల్లూరులోని గిరిజన ఆశ్రమ పాఠశాలకు చెందిన 38 మందికిపైగా విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఆ ఘటనను మరువక ముందే మరోసారి అదే ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థినులు అనారోగ్యం పాలయ్యారు. శనివారం సాయంత్రం అల్పహారంగా పకోడీ తిన్న విద్యార్థినుల్లో 15మంది ఆదివారం ఉదయం అస్వస్థతకు గురవగా.. వారిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ వరుస ఘటనలు వసతి గృహ పర్యవేక్షణ లోపాన్ని ఎత్తి చూపుతుండగా.. వంట తయారీ దారులు తగిన జాగ్రత్తలు పాటించడం లేదని, వంటకు వినియోగించే సామగ్రి నాణ్యతపై అనుమానాలున్నాయని తల్లిదండ్రుల అభిప్రాయపడుతున్నారు.

- కల్లూరు, ఆంధ్రజ్యోతి

పెరుగుతున్న గోదావరి



భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం

భద్రాచలం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ఆదిలాబాద్ జిల్లాలోని కడెం ప్రాజెక్టు నుంచి భారీ ఎత్తున వరద నీరు విడుదల చేయడం, ప్రాణహిత నుంచి కూడా వరద నీరు గోదావరిలో చేరడంతో భద్రాచలం వద్ద నీటి మట్టం పెరుగుతున్నట్టు అధికారులు చెబుతున్నారు. శనివారం సాయంత్రం 29.5 అడుగులున్న నీటిమట్టం అర్ధరాత్రి 31.4 అడుగులకు చేరింది. అనంతరం పెరుగుతూ ఆదివారం ఉదయం 6 గంటలకు 32.8, మధ్యాహ్నం ఒంటిగంటకు 33.7అడుగులకు చేరి రాత్రి 11గంటలకు 33.6కి తగ్గింది. అయితే ఆదివారం అర్ధరాత్రి నుంచి ఉదయం వరకు మళ్లీ నీటిమట్టం పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. గోదావరి వరద పెరగడంతో భద్రాచలం వద్ద స్నాన ఘట్టాలు నీటమునిగాయి. పుణ్యస్నానాలకు వచ్చే భక్తుల రక్షణ కోసం హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయడంతో పాటు తీరంలో గజ ఈతగాళ్లను మోహరించారు.



పామర్తి ప్రేమ్‌కుమార్ (ఫైల్)

సెల్ఫీ సరదా..

ప్రాణం తీసింది..

- జలపాతంలో గల్లంతైన యువకుడి మృతి
- మహబూబాబాద్ జిల్లా ఏడుబావుల వద్ద ఘటన
- మృతుడిది ఖమ్మం జిల్లా జన్నారం
- మూడేళ్ల క్రితం వాగులో పడి అన్న మరణం

7

తాళం వేయాలంటే..

భయం.. భయం



ఇటీవల ఖమ్మంలోని ఓ కాలనీలో అర్ధరాత్రి ఆయుధాలతో సంచరిస్తున్న దొంగలు (ఫైల్)



- జిల్లాలో వరుస దొంగతనాలు.. ప్రజల బెంబేలు
- పెరుగుతున్న చోరీ కేసులు
- కనపడని పోలీస్ పెట్రోలింగ్
- అర్ధరాత్రి మారణాయుధాలతో తిరుగుతున్న దుండగులు
- పట్టపగలు కూడా రెచ్చిపోతున్న దొంగలు

ఖమ్మం క్రైం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ఇంటికి తాళం వేసి ఎటైనా వెళ్లాలంటే భయపడిపోతున్నారు ప్రజలు. అర్ధరాత్రి వేళలే కాదు.. పట్టపగలు కూడా చోరీలు జరుగుతుండటంతో బెంబేలెత్తిపోతున్నారు. ఇటీవల కాలంలో ఖమ్మం జిల్లాలో జరిగిన వరుస దొంగతనాలు జరగ్గా.. అవన్నీ ఒకే తరహాలో జరగడం గమనార్హం. తాళాలు వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా దుండగులు రెచ్చిపోతున్నారు. అయితే గతంలో పోలీసులు చోరీ ఘటనల్లో నిందితులను పట్టుకోవడం, రిమాండ్ చేయడం, వారి నుంచి సొత్తు రికవరీ చేయడం లాంటివి కొద్ది నెలలుగా తగ్గుముఖం పట్టాయన్న విమర్శలున్నాయి. ఇందుకు ఇటీవల కాలంలో జిల్లా వ్యాప్తంగా పోలీస్ స్టేషన్లలో వందల సంఖ్యలో చోరీ కేసులు నమోదైతే.. రికవరీలు అంతంతమాత్రంగానే జరుగుతుండటం నిదర్శనంగా చెబుతున్నారు.

వరస చోరీలతో ప్రజలు బెంబేలు

జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న చోరీల ఘటనలు చూసి ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇల్లు విడిచి బయటకు వెళ్లలేని పరిస్థితిలో ఉన్నారు. ఇళ్లలో చోరీలు మాత్రమే కాదు. రోడ్ల పక్కన ద్విచక్రవాహనాలు నిలిపివెళ్లినా తిరిగి వచ్చే సరికి ఆవాహనం చోరీకి గురవుతోంది. మహిళలు వాకింగ్ కు వెళ్లినా.. ఇంటి ముందు ముగ్గు వేస్తున్నా మెడలో బంగారు గొలుసులు అపహరిస్తున్నారు. ముఖ్యంగా ఇటీవల ఖమ్మంలో జరిగిన పలు సంఘటనలు చూస్తే బయటకు రావాలన్నా భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

మారణాయుధాలతో దొంగలు.. అపార్ట్‌మెంట్లలో చోరీలు..

చోరీలకు పాల్పడేందుకు వస్తున్న దొంగలు ఇనుపరాడ్ల లాంటి మారణాయుధాలతో అర్ధరాత్రులు తిరుగుతున్న దృశ్యాలు సీసీ ఫుటేజీల్లో లభ్యం కావడం, ఆ వీడియో సోషల్‌మీడియాలో వైరల్ కావడంతో ప్రజలు వణికిపోతున్నారు. ఇటీవలే నగర శివారులోని గొల్లగూడెం సమీపంలోని ఓప్రముఖ కాలనీలో చోరీ చేసేందుకు వచ్చిన ముగ్గురు వ్యక్తులు రాడ్లు పట్టుకుని తిరిగిన దృశ్యాలు చక్కర్లు కొట్టాయి. దీంతో ఏదైనా పనిపై అర్ధరాత్రులు బయటకు రావాలన్నా, ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు ఇళ్లకు రావాలన్నా భయపడే పరిస్థితి వచ్చింది. గతంలో కూడా పలుమార్లు ఇలాంటి సంఘటనలు జరిగినా పోలీసులు మాత్రం పట్టీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. అలాగే ఇటీవలే ఖమ్మంలో ఓ అపార్ట్‌మెంట్‌లో పట్టపగలు దర్జాగా ఇద్దరు వ్యక్తులు వెళ్లి నాలుగో అంతస్థులోని ఓ నివాసంలో చోరీ చేశారు. అపార్ట్‌మెంట్‌లో సీసీ కెమెరాలు ఉన్నా.. వారు దర్జాగా సొత్తు దోచుకెళ్లారు. అదే విధంగా ఇటీవ ఖమ్మం బైపాస్‌రోడ్డు సమీపంలోని ఓ ఇంటి ఎదుట తెల్లవారుజామున ఓ మహిళ ఇంటి ముగ్గు వేస్తుండగా గుర్తుతెలియని దుండగుడు ద్విచక్రవాహనంపై వచ్చి గొలుసును లాక్కుని పరారయ్యాడు.

కనపడని పోలీస్ పెట్రోలింగ్..

అర్ధరాత్రి ఆకతాయిల అరికట్టేందుకు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా ఉండేందుకు ఏర్పాటు చేసిన పోలీస్ పెట్రోలింగ్ ఎక్కాడా కనిపించడంలేదు. అర్ధరాత్రి 12గంటల వరకు పోలీసులు విధులు నిర్వహించి తరువాత ఎక్కడో ఒక చోట వాహనం నిలిపి రోడ్డుపై వచ్చే వాహనదారులను ఆపడం లాంటివి చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. తరువాత తమ కారును నిలిపి అందులో నిద్రిస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. పెట్రో కారు అప్పుడప్పుడు కనిపిస్తున్నాయి కానీ బ్లూకోల్ట్స్ వాహనాలు మాత్రం కనుమరుగైపోయినట్టు తెలుస్తోంది. పోలీసులు ఇలా ప్రధాన రోడ్లపై ఉండటంతో దొంగలు కాలనీల్లో తమ పని తాము చేసుకుంటూ వెళుతున్నారని

(మిగతా 8వ పేజీలో)



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జాన్ బ్రిటాస్

పోలవరం బ్యాక్ వాటర్‌తో..

భద్రాద్రికి ముంపు ముప్పు

- ఆ ఐదు పంచాయతీలను తిరిగి విలీనం చేయాల్సిందే
- రాముడిపై ప్రేమ ఉంటే భద్రాచలాన్ని అభివృద్ధి చేయాలి
- సీపీఎం రాజ్యసభాపక్ష నేత జాన్ బ్రిటాస్

భద్రాచలం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పోలవరం బ్యాక్ వాటర్‌తో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా భాసిల్లుతున్న భద్రాచలానికి ముంపు ముప్పు ఉందని, ఏపీలో నిర్మిస్తున్న ఆ ప్రాజెక్టుకు సీపీఎం వ్యతిరేకం కాదని, ఆ ప్రాజెక్టు నిర్మాణంతో ముంపునకు గురవుతున్న నిర్వాసితులను ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్రానిదేనని సీపీఎం రాజ్యసభా పక్ష నేత జాన్ బ్రిటాస్ పేర్కొన్నారు. ఏపీలో పరిధిలో ఉన్న పోలవరం ముంపు ప్రాంతాల పరిశీలనకు వెళ్లే క్రమంలో ఆదివారం ఉదయం ఆయన భద్రాచలంలో ఆగారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడిన ఆయన పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో 1.06 లక్షల కుటుంబాలు నిర్వాసితులవుతున్నారని, ఇందులో 80శాతం మంది ఏజెన్సీలోని నిరుపేద గిరిజనులేనని గుర్తు చేశారు. వీరికి అందించే పునరావాస ప్యాకేజీ పూర్తి స్థాయిలో అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మూడేళ్ల క్రితం పునరావాస ప్యాకేజీలో భాగంగా నిర్మించిన ఇళ్లకు మౌలిక వసతులు, సదుపాయాలు కరువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాముడిపై నిజంగా ప్రేమ ఉంటే మూడున్నర శతాబ్దాల చరిత్ర గల భద్రాచలం రామాలయాన్ని కేంద్రం అభివృద్ధి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. ఏపీ రాష్ట్ర విభజన శాస్త్రీయంగా నిర్వహించలేదని ఫలితంగా భద్రాచలం ఏజెన్సీకి తీవ్ర నష్టం

(మిగతా 6వ పేజీలో)

దర్బారు సేవలో ఆధిపత్య పోరుపై..
ఈవో సీరియస్!

హరిదాసుల తీరుపై అధికారులకు నోటీసులు జారీ



భద్రాచలం సీతారామచంద్ర స్వామి ఆలయం

భద్రాచలం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో శనివారం నిత్య కల్యాణ మండపం వద్ద జరిగిన దర్బారు సేవలో హరిదాసుల మధ్య జరిగిన ఆధిపత్య పోరుపై దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి సీరియస్ అయినట్లు సమాచారం. ఎంతో వైభవంగా జరగాల్సిన దర్బారు సేవ ఇటీవల కాలంలో ఆ స్థాయిలో జరగడం లేదని దేవస్థానం వర్గాలే అంతర్గతంగా అంగీకరిస్తున్నాయంటే పరిస్థితి ఏ రీతిన ఉందో అవగతమౌతోంది. భక్తుల సమక్షంలో రామయ్యకు దర్బారు సేవ నిర్వహిస్తున్న హరిదాసులు ఇలా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. అయితే ఇది కేవలం ఒక రోజులో జరిగిన సంఘటన కాదని, ఇటీవల కాలంలో తరచూ ఈ విధంగా వాదోపవాదనలు, మైకులు లాక్కోవడం లాంటివి జరుగుతున్నాయని తెలిసింది. ఇటీవల అంతరాలయంలో పవళింపు సేవ నిర్వహిస్తున్నప్పుడు కూడా ఇదే పరిస్థితి ఏర్పడిందని తెలుస్తోంది. సంబంధిత అధికారుల పర్యవేక్షణ పూర్తి స్థాయిలో లేకపోవడం తోనే వీరు ఈ విధంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలూ లేకపోలేదు. శనివారం రాత్రి ఘటన సమయంలో అధికారుల పర్యవేక్షణ లోపించిందనే విమర్శలు వస్తున్న క్రమంలో ఈ విషయంపై సంబంధిత అధికారికి నోటీసు జారీ చేయమని ఈవో ఆదేశించినట్టు వినికిడి. కాగా ఇదే సమయంలో హరిదాసులు వ్యవహరిస్తున్న తీరుపై వారితో ఈవో మాట్లాడనున్నట్లు సమాచారం.

చర్చనీయాంశమైన 'ఆంధ్రజ్యోతి' కథనం

'రామయ్య దర్బారు సేవలో ఆధిపత్య పోరు!' శీర్షికన శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం చర్చనీయాంశమైంది. భద్రాద్రి దేవస్థానం వర్గాలు, రామ భక్తులు ఈ విషయంపై చర్చించుకోవడం కనిపించింది. కొంతకాలంగా ఎంతో ప్రాధాన్యమైన దర్బారు సేవ నిర్వహణలో ఇటువంటి పరిస్థితులు చోటు చేసుకోవడం భక్తులను ఆవేదనకు గురి చేస్తోంది.

కొత్త హరిదాసులెవరినీ రానివ్వరా?

రామాలయంలో కొత్త హరిదాసులెవరినీ రానివ్వరా అంటూ వైదిక పెద్ద ఒకరు తీవ్ర ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. కొత్తవారు పాడేందుకు వస్తే ప్రోత్సహించాల్సింది పోయి శృతి, తాళం, రాగం పేరుతో సమస్యలను సృష్టించడం సమంజసం కాదని పేర్కొన్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా దర్బారు సేవ వైభవంగా జరిగేందుకు దేవస్థానం అధికారులు చర్యలు చేపట్టాలని ఇటు దేవస్థానం, అటు రామ భక్తులు ముక్తకంఠంతో కోరుతున్నారు. దర్బారు సేవలో మంచి గాయకులను, భజన తెలిసిన వారిని ప్రోత్సహిస్తే సముచితంగా ఉంటుందని భక్తులు సూచిస్తున్నారు. సంగీత పరిజ్ఞానం ఉన్న వారిని గుర్తించి వారికి ప్రోత్సాహం, సహకారం అందిస్తే దర్బారు సేవ వైభవం పునరుద్ధరించే అవకాశం ఉంటుందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

ముంపు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పాల్వంచ, భద్రాచలంలో కంట్రోల్ రూముల ఏర్పాటు
పాఠశాలల్లోని విద్యార్థులను బయటకు అనుమతించవద్దు
భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్

భద్రాచలం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): గోదావరి వరద పెరుగుతున్నందున ఐటీడీఏ పరిధిలోని ముంపు ప్రాంతంలో ఉన్న గిరిజన గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. వరద ప్రభావం ఎక్కువగా ఉండే దుమ్ముగూడెం, చర్ల, గుండాల, అశ్వాపురం, మణుగూరుల్లో చెక్‌డ్యాంలు, చెరువులు, వాగులు పొంగుతున్నందున గిరిజన రైతులు ఎవరూ వాగులు దాటవద్దని హెచ్చరించారు. పొలాలకు వెళ్లే వారు విద్యుత్ స్తంభాలను తాకకూడదని, ముంపు ప్రాంతాల్లో ఉన్న ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులను బయటకు రాకుండా చూడాల్సిన బాధ్యత హెచ్ఎంలదే అన్నారు. భద్రాచలం,పాల్వంచ కలెక్టరేట్‌లలో కంట్రోల్ రూములు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పాల్వంచ కలెక్టర్‌లో 0874-4241950 (ల్యాండ్‌లైన్), 9392919743 (వాట్సప్), భద్రాచలం ఐటీడీఏలో కంట్రోల్ రూము నెంబరు 7995268352, సబ్‌కలెక్టరు కార్యాలయంలో 08743-232444 (ల్యాండ్‌లైన్), 93479 10737(వాట్సప్) నెంబర్లకు సమాచారం అందించాలన్నారు.

శాంతించిన 'పాలేరు'



పాలేరు జలాశయం

కూసుమంచి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు పాలేరు జలాశయం శాంతించింది. పరీవాహక ప్రాంతం నుంచి వరద గణనీయంగా తగ్గింది. గరిష్ట నీటిమట్టం 23 అడుగులకుగాను 22.65 అడుగులకు తగ్గింది. సాగర్ డ్యాం నుంచి నీటిని నిలిపివేయగా, పరీవాహక ప్రాంతాల నుంచి 2560 క్యూసెక్కులు మాత్రమే వచ్చి చేరుతోంది. పాలింగ్ గేట్ల ద్వారా 4022 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. గత పదిరోజులుగా పెరుగుతూ, తగ్గుతూ ఉండటంతో కొంత ఆందోళన కలిగించగా, పూర్తిగా శాంతించడంతో అధికారులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

భద్రాద్రి జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న సీనియర్ క్రీడాకారులు

చుంచుపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నూతన వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కమిటీని ఆదివారం చుంచుపల్లి మండలంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.జిల్లా అధ్యక్షుడిగా వాసిరెడ్డి నరేష్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా ఏ.నవీన్‌కుమార్, జనరల్ సెక్రటరీ పి.చైతన్య, జాయింట్ సెక్రటరీలుగా ఎల్.ఉమారాణి, వై.వేణుగోపాలరావు, కోశాధికారి జి.విజయకుమార్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా మంజుల, మహేష్, రాక్కమ్మ, నజీముద్దీన్, రమేష్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా లక్కినేని వెంకటదుర్గారావు వ్యవహరించారు. నూతన కమిటీ సభ్యులకు భద్రాద్రి జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా కార్యదర్శి భట్టు ప్రేమ్‌కుమార్ శుభాకాంక్షలు తెలిపారు.

సింగరేణి సివిల్ అధికారుల నిర్లక్ష్యం

నీరుగారుతున్న యాజమాన్య లక్ష్యం - కమ్యూనిటీ హాల్ నిర్మాణంలో జాప్యం



అసంపూర్తిగా నిలిచిపోయిన సింగరేణి కన్వర్షన్ హాల్

రుద్రంపూర్, (సింగరేణి) ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి యాజమాన్యం కార్మికుల సంక్షేమం కోసం అధిక ప్రాధాన్యత ఇస్తోంది. కార్మికులకు అవసరమైన మౌలిక సదుపాయాల ఏర్పాటు కోసం కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తోంది. సింగరేణి సివిల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా సింగరేణి యాజమాన్య లక్ష్యం నీరు గారుతున్న పరిస్థితి కొత్తగూడెంలో కొనసాగుతోంది. కొత్తగూడెం కార్పొరేట్ పరిధిలో పని చేస్తున్న సింగరేణి అధికారులు, ఉద్యోగులు సమీప ప్రాంత ప్రజలకు ఉపయోగపడే విధంగా సుమారు రూ. 3.50కోట్లతో 2003లో రైటర్‌బస్తీలో కన్వర్షన్ హాల్ నిర్మాణానికి యాజమాన్యం చర్యలు చేపట్టింది. నిర్మాణ పనులను చేపట్టిన సింగరేణి సివిల్ అధికారులు పూర్తిస్థాయిలో పనులు చేయకపోవడం వల్ల కన్వర్షన్ హాల్ నిరుపయోగంగా మారింది. కన్వర్షన్ హాల్‌కు సంబంధించి అన్ని రకాల సదుపాయాలను కల్పించేందుకు రూ.3.50కోట్లను కేటాయించింది. ఆ నిధులతో కన్వర్షన్ హాల్ పనులు కొనసాగినప్పటికీ డైనింగ్, కిచెన్, ఏసీల ఏర్పాటుకు నిధుల కొరత ఏర్పడినట్లు సివిల్ అధికారులు తెలిపారు. కోటి రూపాయల మంజూరు కోసం యాజమాన్యానికి సివిల్ అధికారులు లేఖ రాయడంతో రూ.350కోట్ల వ్యయంతో ఏఏ పనులు కొనసాగించారో చెప్పాలంటూ యాజమాన్యం సివిల్ అధికారులకు లేఖలు రాయడం చర్చనీయాంశంగా మారింది. కన్వర్షన్ హాల్ ప్రాంగణాల్లో పనులు చేపట్టినప్పటికీ వర్షం వస్తే ప్రాంగణమంతా నీటితో నిండిపోతున్న పరిస్థితి నెలకొంటుంది. సింగరేణి అధికారులకు, ఉద్యోగులకు ఉపయోగపడే విధంగా నిర్మిస్తున్న కన్వర్షన్ హాల్ పనులు నత్తనడకన నడుస్తోన్నాయి. సివిల్ అధికారులు పూర్తిస్థాయిలో స్పందించకపోవడం కారణంగా రూ.కోట్లు వెచ్చించినప్పటికీ కమ్యూనిటీ హాల్ నిరుపయోగంగా మారింది. కొత్తగూడెం పట్టణ ప్రజలకు సైతం కన్వర్షన్ హాల్ అందుబాటులోకి వస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆశగా ఎదురుచూసిన ప్రజానీకానికి నిరాశే ఎదురవుతోంది. ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో శుభకార్యాలు నిర్మించాలంటే రూ.లక్షలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని సింగరేణి ఉద్యోగులు వాపోతున్నారు. సింగరేణి యాజమాన్యం, చైర్మన్ బలరాం ప్రత్యేక చొరవ తీసుకుని కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను వేగవంతం చేసే విధంగా చర్యలు చేపట్టాలని వేడుకుంటున్నారు. ఆ దిశగా సింగరేణి యాజమాన్యం నిధుల కేటాయింపుపై ప్రత్యేక దృష్టి సారించాలని సింగరేణి కార్మికసంఘాల నాయకులు డిమాండ్ చేస్తోన్నారు.

పనులను వేగవంతం చేయాలి

వంగా వెంకట్, ఏఐటీయూసీ కేంద్ర కమిటీ కార్యదర్శి



కన్వర్షన్ హాల్ పనులను వేగవంతం చేయాలి. సింగరేణి ఉద్యోగులకు ఉపయోగపడే విధంగా కన్వర్షన్ హాల్‌ను అందుబాటులోకి తీసుకురావాలి. నిర్మాణ పనుల్లో సివిల్ అధికారులు నిర్లక్ష్యాన్ని వీడాలి. అన్ని హంగులతో ఆధునీకరించి పనులను పూర్తి చేయాలి, లేనిపక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తాం.

అయోధ్య సేవలు చిరస్మరణీయం

సంతాప సభలో ఎమ్మెల్యే కూనంనేని
ప్రశ్నించే గొంతు మూగబోయింది : మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్



బొల్లోజు అయోధ్య సంతాప సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

మణుగూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఉమ్మడి ఖమ్మం జడ్పీ మాజీ వైస్ చైర్మన్ బొల్లోజు అయోధ్య సేవలు చిరస్మరణీయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మణుగూరు పట్టణంలోని కిన్నెర కళ్యాణ మండపంలో జరిగిన అయోధ్య సంతాప సభకు హాజరై, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం అహర్నిశలు శ్రమించి, పార్టీ పురోగతికి ఎనలేని సేవలనందించారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు నిర్వహించి, పినపాక నియోజకవర్గానికి ఎర్రజెండాయే పేదల అండ అని నిరూపించిన నిఖార్సయిన కమ్యునిస్టును కోల్పోవడం పార్టీకి తీరని లోటన్నారు. అనంతరం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తనకు రాజకీయ ఓనమాలు నేర్పిన గురువును కోల్పోవడం దురదృష్టకరమని ఉద్వేగానికి లోనై, కన్నీటి పర్యంతమయ్యారు. అనంతరం ఎంపీ బలరాం నాయక్ మాట్లాడుతూ, ప్రశ్నించే గొంతు మూగబోయిందని, అట్టడుగు, బడుగు బలహీన వర్గాలను అక్కున చేర్చుకుని, వారి శ్రేయస్సుకై ఆయన సాగించిన ఉద్యమాలు, పోరాటాలు మార్గదర్శనీయమన్నారు. డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య మాట్లాడుతూ, అయోధ్య అంకితభావం, నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు అని, ప్రజాసమస్యలే తన సమస్యలుగా భావించే ప్రజానాయకుడిని కోల్పోవడం బాధాకరం అన్నారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజానుబంధ సంఘాలు, ట్రేడ్ యూనియన్‌ల నాయకులు హాజరై అయోధ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి, సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, పోటు రంగారావు, మండె వీరహన్మంతరావు, భాస్కరరావు, కమటం వెంకన్న, వేల్పుల మల్లిఖార్జున్, నెల్లూరి నాగేశ్వరరావు, వట్టం నారాయణదొర, పోటు కళావతి, నరాటి ప్రసాద్, దండి సురేష్, కోలేటి భవానీ శంకర్, పుల్లారెడ్డి, లక్ష్మీకుమారి, కుర్రి నాగేశ్వరరావు, రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటి పరామర్శ



నివాళులర్పిస్తున్న మంత్రి పొంగులేటి

మణుగూరు రూరల్ ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ బొల్లోజు అయోధ్య చారి కుటుంబ సభ్యులను రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం రాత్రి పరామర్శించారు. సీపీఐ రాష్ట్ర నేత అయోధ్య గతవారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే, ఆదివారం రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మణుగూరు మండలం రామానుజవరం గ్రామంలో గల అయోధ్య స్వగ్రామానికి చేరుకొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అయోధ్య కుటుంబానికి అన్నివేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మంత్రితో పాటు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, కాంగ్రెస్ రాష్ట్ర నేతలు తుళ్లూరు బ్రహ్మయ్య, మువ్వా విజయబాబు, పోలబోయిన శ్రీవాణి నవీన్, శివరాజు తదితరులు పాల్గొన్నారు.

పోలవరం బ్యాక్ వాటర్‌తో..
భద్రాద్రికి ముంపు ముప్పు

(5వ పేజీ తరువాయి)

వాటిల్లిందన్నారు. ఈ క్రమంలో ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేసి ఆంధ్రప్రదేశ్ పునర్విభజన అంశాన్ని పునఃపరిశీలన చేయాలన్నారు. తెలుగు రాష్ట్రాల సరిహద్దుల్లోని ఆ ఐదు పంచాయతీలను తిరిగి భద్రాచలంలో విలీనం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆనాడు ముంపు మండలాలను ఏపీలో విలీనం చేసేందుకు ఐదు సెకండ్లు కూడా తీసుకొని ఉండరేమోనని అన్నారు. స్థానికుల మనోభావాలను గుర్తించి ఐదు పంచాయతీలను భద్రాచలంలో విలీనం చేయాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్నారు. బిహార్‌లో వివిధ కారణాలతో ఓట్ల తొలగింపును ఎన్నికల సంఘం చేపట్టడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయని, దేశ అత్యున్నత న్యాయస్థానం ఈ విషయంపై స్పందించడంతో కదలిక వస్తోందన్నారు.. ఓట్ల తొలగింపు కేవలం బిహార్‌కే పరిమితం కాదని రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలపై కూడా ఈ ప్రభావం పడే అవకాశాలు లేకపోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. మోదీ, ట్రంప్ స్నేహితులైతే భారత్‌పై అమెరికా ఎందుకు సుంకాలను విధించిందని ఆయన ప్రశ్నించారు. మూడు పర్యాయాలు ప్రధానిగా బాధ్యతలు నిర్వహిస్తున్న మోదీ నేటి వరకు ఒక్క పత్రికా విలేకరుల సమావేశంలో మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు, జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, ఏజే రమేష్, జిల్లా నాయకులు కారం పుల్లయ్య, బండారు శరత్‌బాబు, ఎంబి నర్సారెడ్డి, గడ్డం స్వామి, యలమంచి వంశీకృష్ణ, వై.వెంకట్రామారావు, డి.సీతాలక్ష్మి, ఎస్.భూపేంద్ర పాల్గొన్నారు.

రైల్వే బుకింగ్ కౌంటర్ ప్రారంభం

చింతకాని, ఆంధ్రజ్యోతి 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగులవంచ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు టికెట్లు అందించే బుకింగ్ కౌంటర్‌ను రైల్వే అధికారులు ఆదివారం పునఃప్రారంభించారు. ప్రయాణికులు రైల్వే సేవలను వినియోగించుకోవాలని ఖమ్మం రైల్వే కమర్షియల్ సూపర్‌వైజర్ శ్రీనివాసులు తెలిపారు. అతి తక్కువ రవాణా చార్జీలతో విజయవాడ, సికింద్రబాద్‌లకు ప్యాసింజర్ రైలు సేవలను నడుపుతున్నామన్నారు. అనంతరం రామాపురం, పాతర్లపాడు, నాగులవంచ, రైల్వే కాలనీ ప్రజలు ప్యాసింజర్ రైలుకు టికెట్‌లు కొనుగోలు చేసి చింతకాని వరకు ప్రయాణించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తేలుకుంట్ల శ్రీను, బొర్రా ప్రసాద్‌రావు, వంకాయలపాటి సత్యనారాయణ, అంబటి శాంతయ్య, పరిటాల యలమంద, తొండపు వేణు, కరణం తిరుమలరావు, గుత్తా రామారావు, కంచుమర్తి గోవర్ధన్, దామాల రవి, ఆలస్యం నరేష్, కొపూరి నవీన్ పాల్గొన్నారు.

మరో 15మందికి అస్వస్థత

అల్పాహారం తిని ఆస్పత్రి పాలైన కల్లూరు గిరిజన ఆశ్రమ విద్యార్థినులు
రెండువారాల వ్యవధిలో మరోసారి ఘటన
విచారణ నిర్వహించిన తహసీల్దార్



అస్వస్థతకు గురియైన విద్యార్థినులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సాంబశివుడు

కల్లూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : మరో సారి ఖమ్మం జిల్లా కల్లూరులో ని గిరిజన ఆశ్రమ పాఠశాలలో 15మంది విద్యార్థినులు అస్వస్థతకు గురికావడం కలకలం రేపింది. శనివారం సాయంత్రం అల్పాహారంగా పకోడీ తిన్న విద్యార్థినుల్లో 15మంది ఆదివారం ఉదయం అస్వస్థతకు గురవగా.. వారిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ సంఘటనకు సంబంధించి వివరాలివీ.. పాఠశాల సమయానంతరం వసతి గృహంలో శనివారం సాయంత్రం 4 గంటల తర్వాత అల్పాహారంగా అందించాల్సిన పకోడీని అలస్యంగా రాత్రి 7 గంటల తర్వాత భోజనంతో పాటుగా కలిపి పెట్టారు. ఈ ఆహారం తిన్న విద్యార్థినుల్లో ఆదివారం ఉదయం 6గంటల నుంచి కడుపు నొప్పి, వాంతులు, విరేచనాలు, వికారం లాంటి లక్షణాలతో ఒకరి తర్వాత మరొకరు వరుసగా 15మంది అస్వస్థతకు గురవగా.. వారందరినీ కల్లూరులోని సీహెచ్‌సీకి తరలించారు. అయితే వరుస సెలవులు రావడంతో మొత్తం 96 మంది విద్యార్థినులకు గాను 43మంది ఉండగా వారిలో 15 మంది అస్వస్థతకు గురయ్యారు. ఇక ఇదే ఆశ్రమ పాఠశాలలో ఈ నెల 5న ఉడికీ ఉడకని అన్నం వడ్డించడంతో 38 మందికి పైగా అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఈ సంఘటన జరిగిన రెండు వారాల వ్యవధిలోనే మరోసారి 15మంది విద్యార్థినులు అస్వస్థతకు గురవడం.. వసతి గృహ పర్యవేక్షణ లోపాన్ని ఎత్తి చూపుతోంది. వంట తయారీలో వంటవారు తగిన జాగ్రత్తలు పాటించడం లేదని, వంటకు వినియోగించే సామగ్రి నాణ్యతపై అనుమానాలున్నాయన్న అభిప్రాయాలు తల్లిదండ్రుల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఈ వసతి గృహంలో మధ్యాహ్నం వండిన పప్పు, సాంబారులో మిగిలిన దాన్ని రాత్రి కూడా పెడుతున్నారని విద్యార్థినులు ఆరోపిస్తున్నారు. తహసీల్దార్ పి.సాంబశివుడు, గిరిజన సంక్షేమశాఖ జిల్లా అధికారి విజయలక్ష్మి, ఏంఈవో పి.నివేదిత గిరిజన పాఠశాలను సందర్శించి విద్యార్థినీలతో కలిసి ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపారు. వసతి గృహంలో ఆహారం తయారీ, నిర్వహణ తీరుపై విద్యార్థినుల నుంచి కూడా వివరాలు తెలుసుకున్నారు. అస్వస్థతకు గురైన విద్యార్థినులకు వైద్యులు వినిత్, అఖిల, సిబ్బంది సకాలంలో వైద్య సేవలు అందించడంతో వారు త్వరగా కోలుకున్నారు. వారిని ఆస్పత్రిని నుంచి డిశ్చార్జ్ చేశారు. అంతకు ముందు తహసీల్దార్ సాంబశివుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించారు. మండల కాంగ్రెస్ నాయకులు తక్కెళ్లపాటి దుర్గాప్రసాద్, ముకర విజయరావు, మట్టా రామకృష్ణ, సీపీఐ కార్యదర్శి దయాకర్ గిరిజఆశ్రమ పాఠశాలను సందర్శించారు.

ఇంకెంతకాలం?

(5వ పేజీ తరువాయి)



పగుళ్లు వచ్చిన కట్టపై సీసీ రోడ్డు



జాతీయ రహదారిపై ఇక్కడే ఎలివేటెడ్ రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉంది

అంశం. అలాగే భద్రాచలంలోని కూనవరం రహదారిలో నిర్మించ తలపెట్టిన ఎలివేటెడ్ రోడ్డు నిర్మాణంలో కూడా ఎడతెగని జాప్యం జరుగుతోందన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

ఏపీ వైపు ఉన్న రక్షణ గోడ కూలింది

రెండు తెలుగు రాష్ట్రాల సరిహద్దుల్లోని ఏపీ వైపు ఉన్న గోదావరి వరద కరకట్ట రక్షణ గోడ కూలింది. కాగా మిగిలిన గోడ ఒక వైపు ఒరిగి కూలేందుకు సిద్ధంగా ఉంది. ఈ రక్షణ గోడ ఏపీ పరిధిలోని అల్లూరి జిల్లా యటపాక మండల పరిధిలోకి వస్తుందని తెలంగాణ నీటిపారుదల శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. భద్రాచలంలోని గోదావరి వారధి నుంచి యటపాక వైపు ఉన్న గోదావరి కరకట్ట మూడో స్లూయిస్ (1.078 కి.మీ. దాటిన చోట) రక్షణ గోడ కూలింది. దశాబ్ద కాలంగా ఏపీ పరిధిలోని కరకట్ట నిర్వహణ బాధ్యతను అక్కడి ప్రభుత్వం అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తిందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా భద్రాచలం వైపు కూడా గతంలో నిర్మించిన రక్షణ గోడ కొద్దిగా ఒరిగింది. ఇదిలా ఉండగా ఎఫ్‌డీఆర్ నిధులు ఏటా వస్తున్నా కరకట్ట పరిసరాల్లో పూర్తిస్థాయిలో పనులు చేపట్టకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. కాగా ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టకపోతే మరింత ప్రమాదమని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక వేళ గోదావరి ఉగ్రరూపం దాల్చి వరద నీరు పొంగి పొర్లితే భద్రాచలంలోని పలు కాలనీలు నీట మునిగే అవకాశాలు స్పష్టంగా ఉన్నాయని స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

సగం రక్షణ గోడతోనే సరిపెట్టారు

గతంలో ప్యాకేజీ నెంబరు 74లో భాగంగా రూ.54.50కోట్ల పనులను చేపట్టి రక్షణ గోడను పూర్తి చేయాల్సి ఉంది. కానీ సగం మేరకే రక్షణ గోడను రూ.24.66 కోట్లతో నిర్మించారు. అనంతరం గోదావరి వారధి నుంచి కూనవరం వైపు కరకట్టపై రక్షణ గోడ నిర్మాణం చేపట్టకుండా అర్ధాంతరంగా నిలిపివేశారు. ఈ రక్షణ గోడ నిర్మాణానికి ప్రధాన కారణం 1986 ఆగస్టు 16న భద్రాచలంలో వచ్చిన గోదావరి మహావరద 75.6 అడుగులను దృష్టిలో ఉంచుకొని 80అడుగులతో కరకట్ట నిర్మాణం చేపట్టారు. అలాగే ఈ కరకట్టపై నుంచి మరో ఆరు అడుగులు ఎత్తు ఉండేలా రక్షణ గోడలను కూడా నిర్మించాలని అప్పటి ప్రభుత్వం భావించి నిధులు మంజూరు చేసింది. అయితే రక్షణ గోడలు పూర్తిస్థాయిలో నిర్మాణంకు నోచుకోకుండా ఆగిపోయాయి. ఇదిలా ఉండగా భద్రాచలం పట్టణంలో ఇటీవల 2022 జూలై 16న వచ్చిన మహా గోదావరి వరదలతో భద్రాచలం వద్ద 71.3 అడుగుల నీటిమట్టం నమోదైనా గతంలో నిర్మించిన కరకట్ట రక్షణగా నిలిచింది. ఈ క్రమంలో కొన్ని చోట్ల కరకట్ట రివిట్‌మెంట్‌కు మరమ్మతులు చేయాల్సి ఉంది.

కుక్కల్ని పెంచి పోషిస్తున్న కేఎంసీ

ఆవాసాలుగా మారిన హాట్‌స్పాట్‌లు
విచ్చల విడిగా నగరంలో కుక్కల పెరుగుదల



ప్రధాన సెంటర్‌లో కుక్కలు


పారిశుధ్య హాట్‌స్పాట్‌లో తింటున్న కుక్క →

ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కుక్కల సంతతి పెరగకుండా చూడాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖమ్మం నగర పాలక సంస్థకు కచ్చితమైన మార్గదర్శకాలు ఇచ్చాయి. ఈ మేరకు కేఎంసీ ఆధ్వర్యంలో ఏనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్(ఏబీసీ సెంటర్)ను ప్రతినెల రూ.లక్షల వ్యయంతో నిర్వాహణ చేపడుతున్నారు. కానీ ఖమ్మం నగరంలో కుక్కల సంతతి పరిమితిలో ఉండకపోగా నగర ప్రజలతో తమ సంతతితో పోటీ అంటూ కుక్కల సంతతిని పెంచుకుంటున్నాయి. ప్రధాన రహదారుల నుంచి అంతర్గత వీధుల వరకు ఏ వీధిలో చూసిన కుక్కలు యథేచ్ఛగా తిరుగుతుండటంతో నగర ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు.

ఆహార కేంద్రాలుగా మారిన హాట్‌స్పాట్‌లు

ఖమ్మం నగరంలో 30 డివిజన్ల వరకు ప్రైవేట్ ఆటోల ద్వారా చెత్త సేకరణ జరుగుతుంది. అయితే ఆయా డివిజన్లలో ప్రైవేట్ వాహనాలకు నెలకు రూ.60 నుంచి రూ.100లు చెల్లించిన వారి నివాసాల నుంచి మాత్రమే ప్రైవేట్ వాహనాల నిర్వాహకులు చెత్తను సేకరిస్తున్నారు. డబ్బులు ఇవ్వలేని వారి నివాసాల నుంచి చెత్త సేకరించటం లేదు. దీంతో ప్రైవేట్ వాహనాలకు చెత్తను ఇవ్వని వారి కూడల్లు ప్రధాన రహదారుల వెంట తమ నివాసాల నుంచి వచ్చిన ఆహారం, పండ్లు, ఇతర వ్యర్థాలను పడేస్తున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ ఆవార్డులు పొందిన ఖమ్మం నగరంలో పారిశుధ్య లోపంతో హాట్‌స్పాట్‌ల సంఖ్య గణనీయంగా పెరిగాయి. అటువంటి హాట్‌స్పాట్‌లు కుక్కల ఆహార కేంద్రాలుగా మారుతున్నాయి. ప్రధాన రహదారుల వెంట తింటూ కుక్కల సంతతిని పెంచుకుంటున్నాయి. కుక్కలు వాహనదారులు, వాకింగ్ చేసే వారి వెంటపడి కరుస్తున్నాయి.

ఢిల్లీ తీర్పుతో ఖమ్మం ప్రజల ఆసక్తి



కుక్కలు, కోతులు ప్రజలపై దాడి చేయటంపై ప్రతి రోజు ఖమ్మం నగరంలోని కార్పొరేటర్లు, మేయర్ పునుకొల్లు నీరజ, మునిసిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్యకు ఫిర్యాదులు చేస్తూనే ఉన్నారు. కాగా కుక్కలు కనిపించవద్దంటూ ఈ మధ్యకాలంలో సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వటంతో ఖమ్మంలో ఎటువంటి చర్యలు తీసుకుంటారని నగర ప్రజల ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

హెచ్‌సీఏ అవినీతిని బయటపెడతాం

- జిల్లాల నుంచి ఒక్క క్రీడాకారుడినైనా రంజీకి ఆడించారా?
- తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి గురవారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న గురవారెడ్డి

ఖమ్మం స్పోర్ట్స్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని జిల్లాలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) ఇప్పటి వరకు చేసిన అవినీతి బండారాన్ని బయటపెడతామని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి గురవారెడ్డి హెచ్చరించారు. ఆదివారం నగరంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హెచ్‌సీఏ కాగితాలపై లెక్కలు చూపుతూ, నిధులను మింగేస్తూ క్రీడాకారులను మోసం చేస్తుందని విమర్శించారు. ఆ సంఘం జిల్లాలలో ఏఒక్క క్రీడాకారుడినైనా రంజీస్థాయి పోటీలకైనా ఆడించిందా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో 90 ఏళ్ల అనుభవం ఉన్న హెచ్‌సీఏలో పెద్ద పెద్ద అవినీతిపరులున్నారని, వారు సుమారు రూ.600 కోట్లను పక్కదారి పట్టించినట్లు తమ దగ్గర పక్కా ఆధారాలతో సమాచారం ఉందని అన్నారు. ఖమ్మం జిల్లాలో సైతం హెచ్‌సీఏ పెద్ద ఎత్తున నిధులను దుర్వినియోగం చేసిందని విమర్శించారు. జిల్లా హెచ్‌సీఏ సెక్రటరీగా 35 ఏళ్లుగా ఏకదాటిగా ఒకే వ్యక్తి ఉండటమేంటని ప్రశ్నించారు. సర్దార్ పటేల్ స్టేడియంలో నెట్స్‌లో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని విమర్శించారు. లేని క్లబ్‌లను చూపిస్తూ ఆ సంఘం పెద్ద మోసం చేస్తుందని అన్నారు. క్రికెట్‌ను నాశనం చేస్తున్న హెచ్‌సీఏ అవినీతిపై సీఐడీ కేసు పెడతామని అన్నారు. సమావేశంలో తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ వరంగల్ జిల్లా కార్యదర్శి జయ్‌పాల్, ప్రముఖ చిన్నపిల్లల వైద్యుడు కూరపాటి ప్రదీప్, సీనియర్ క్రీడాకారులు వీరేష్‌గౌడ్, నసీర్, రాజశేఖర్, కొండ శ్రీను, వెంకటప్రసాద్, నరేష్‌మోహన్, జోజి తదితరులు ఉన్నారు.

వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రంగయ్య

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలపై ప్రభుత్వం రెవెన్యూ, వ్యవసాయశాఖల అధికారులతో సాగు చేసిన పంటలపై సర్వే నిర్వహించి నష్ట పరిహారం చెల్లించాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కెచ్చల రంగయ్య డిమాండ్ చేశారు. ఆదివారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ముందస్తుగా వర్షాలు కురియడంతో రైతులు కూడా వ్యవసాయ సీజన్‌ను ముందుగా ప్రారంభించారని వివరించారు. వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు సరైన అవగాహన కల్పించలేక పోయారని ఆరోపించారు. గత పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు సాగులో ఉన్న పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. పత్తిపంటకు తీవ్ర నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మలీదు నాగేశ్వరరావు, కోలేటి నాగేశ్వరరావు, బీరెల్లి లాజర్, బందెల వెంకయ్య, వేపాకుల శివలింగం, గోకినేపల్లి లలిత, ఎస్కే లాల్మియా, తిమ్మిడి హనుమంతరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రంగయ్య

రూపుదిద్దుకుంటున్న ఓటర్ల జాబితా

- సిద్ధం చేస్తున్న పంచాయతీ అధికారులు

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల కోసం ఓటర్ల జాబితాను అధికారులు సిద్ధం చేస్తున్నారు. పంచాయతీల వారీగా ఓటర్ల వివరాలను కార్యదర్శులు పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు. ఇప్పటికే అధికారులు 20 మండలాలల్లో 14మండలాల్లో జాబితాను పూర్తి చేయగా ఇంకా 6 పంచాయతీల్లో కసరత్తు చేస్తున్నారు. పూర్తైనా జాబితాలను ఒక ట్రెండు రోజుల్లో టీపోల్ పోర్టల్ నమోదు చేస్తారు. ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం గ్రామం యూనిట్‌గా వార్డుల వారీగా ఓటర్ల జాబితాను మళ్లీ తయారు చేస్తున్నారు. ఇప్పటికే రెండుసార్లు పంచాయతీ ఎన్నికల కోసం ఓటర్ల జాబితా ఎంపీడీవోల లాగిన్ ద్వారా టీపోల్ పోర్టల్ నమోదు చేశారు. అయితే పంచాయతీలు తగ్గి వార్డులు సంఖ్య తగ్గడంతో మళ్లీ ఓటర్ల జాబితాను సిద్ధం చేయాల్సి వస్తోంది.



వార్డుల వారీగా విభజన

గతంలో పంచాయతీల్లో ఉన్న గ్రామాలు నేడు ప్రత్యేక పంచాయతీలుగాకొన్ని, మరికొన్ని మునిసిపాలిటీల్లో విలీనం అయ్యాయి. అందుకే కార్యదర్శులు ముందుగా పంచాయతీల వారీగా ఓటర్లను పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు. ఆ తర్వాత రెండో దశలో పంచాయతీలకు వచ్చిన ఓటర్లతో వార్డుల వారీగా విభజిస్తున్నారు. ఈ ప్రక్రియలో ఒక కుటుంబ సభ్యుల ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. కొత్త జాబితాలో మృతుల పేర్లు తొలగించడం, కొత్తగా ఓటు హక్కు కోసం నమోదు చేసుకున్నవారి పేర్లను చేర్చుతున్నారు. ప్రస్తుత ప్రక్రియ కారణంగా ఓటర్ల వరుస సంఖ్యలో కొన్ని మార్పులు జరుగుతున్నట్లు పంచాయతీ అధికారులు చెబుతున్నారు.

5,214 పోలింగ్ కేంద్రాలు

గతంలో 579 పంచాయతీలు ఉండగా తాజాగా 571 పంచాయతీలుగా తేల్చారు. మొత్తం5214 వార్డు స్థానాలుగా మార్పులు చేశారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 579 పంచాయతీలు ఉండేవి. అందులో కల్లూరు మున్సిపల్‌గా మారడంతో నాలుగు పంచాయతీలు అందులోకి వెళ్లాయి. దాంతో పాటు 35 వార్డు స్థానాలు కూడా పురపాలికలో విలీనమయ్యాయి. పోలింగ్ కేంద్రాల సంఖ్య గతంలో 5214గా లెక్కతేల్చారు.

మండలాల వారీగా మ్యాపింగ్ చేసిన ఓటర్లు ఇలా ...

మండలం	ఓటర్లు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
పెనుబల్లి	43,873	19,974	20,872	0	40,846
సింగరేణి	45,511	21,540	22,484	1	44,025
సత్తుపల్లి	36,028	16,748	17,996	1	34,745
ఏన్కూరు	27,920	13,080	14,223	0	27,303
రఘునాధపాలెం	40,790	19,417	21,362	4	40,783
ముదిగొండ	48,554	23,274	25,277	2	48,553
బోనకల్	36,381	17,611	18,769	1	36,381
చింతకాని	41,707	19,987	21,720	0	41,707
కల్లూరు	35,530	17,364	18,166	0	35,530
కామేపల్లి	35,534	17,478	18,059	0	35,537
కొణిజర్ల	41,819	20,425	21,438	1	41,864
కూసుమంచి	50,020	24,241	25,884	2	50,127
మధిర	31,728	15,306	16,419	3	31,728
నేలకొండపల్లి	49,532	23,690	25,841	1	49,532
తల్లాడ	46,261	22,547	23,713	1	46,261
తిరుమలాయపాలెం	50,771	24,557	26,213	1	50,771
వేంసూరు	36,990	18,121	18,869	0	36,990
వైరా	27,306	13,177	14,130	1	27,306
ఎర్రుపాలెం	40,422	19,616	20,807	1	40,424
మొత్తం	8,02,473	3,85,305	4,10,882	22	7,96,209

పెనుబల్లి మండలంలో 93శాతం , సింగరేణిలో 96.73, సత్తుపల్లిలో 96.44, ఏన్కూరులో 97.79, రఘునాధపాలెంలో 99.98 శాతం ఓటర్ల మ్యాపింగ్ పూర్తయ్యింది. ఇంకా బ్యాలెన్స్ ఉంది. మిగిలిన 14 మండలాల్లో నూటికి నూరుశాతం మ్యాపింగ్ పూర్తయ్యినట్లు అధికారులు చెబుతున్నారు. పోలింగ్ కేంద్రాల్లో వినియోగించే బ్యాలెట్ బాక్సులనుకూడా అధికారులు సిద్ధం చేశారు. మొత్తం 5214 బ్యాలెట్ బాక్సులను వినియోగించనున్నారు. వీటికి గాను ఇప్పటికే 3140 బాక్సులు ఉండగా 2300 బాక్సులను గుజరాత్ నుంచి తెప్పించారు. మరో 300 బాక్సులు మహారాష్ట్ర నుంచి నేడో రేపో జిల్లాకు రానున్నాయి.

డీఈసెట్-2025 స్పాట్ అడ్మిషన్లకు అవకాశం

ఖమ్మం ఖానాపురంహవేలి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): డీఈసెట్-2025 స్పాట్ అడ్మిషన్లకు షెడ్యూల్ విడుదలైందని ప్రభుత్వ జిల్లా విద్యాశిక్షణ సంస్థ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, కె. బాలమురళి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డీసెట్ 2025లో ర్యాంకు సాధించి, అర్హత కలిగి డీఈఐఈడీ, కోర్సులో సీటు రాని అభ్యర్థులకు స్పాట్ అడ్మిషన్‌కు హాజరు కాగలరని తెలిపారు. అభ్యర్థులు 19న ప్రభుత్వ డైట్ కళాశాలలో ఖమ్మంలో మిగిలిపోయిన సీట్ల కోసం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు అభ్యర్థులు హాజరు కావాలని తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు స్పాట్ అడ్మిషన్ ద్వారా సీట్లు కేటాయింపు జరుగుతుందని తెలిపారు. ఖమ్మం జిల్లా విద్యా శిక్షణ సంస్థ నందు ఇంగ్లీష్ మీడియంలో ఐదు, తెలుగు మీడియంలో ఎనిమిది సీట్లు కలవని చెప్పారు. 20న ప్రైవేట్ కళాశాలలో మిగిలిపోయిన సీట్ల కోసం అభ్యర్థులు హాజరు కావాల్సి ఉంటుందని, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు సీట్లు కేటాయింపు ఉంటుందని తెలిపారు. కళాశాలలో ఈ నెల 21న రిపోర్టు చేయాలని తెలిపారు.

రాష్ట్రంలో వైద్య అత్యవసర పరిస్థితి ప్రకటించాలి

- సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పట్టణాల నుంచి పల్లెల వరకు పారిశుధ్యలోపం ఏర్పడటంతో ప్రజలు సీజనల్ వ్యాధులు, జ్వరాలతో అల్లాడుతున్నారని రాష్ట్రంలో వైద్య అత్యవసర పరిస్థితిని ప్రకటించాలని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీల్లో పాలకవర్గాలు లేక పోవడంతో ప్రత్యేక అధికారుల పరిపాలన కొనసాగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణ ప్రాంతాల్లోనూ సరైన పారిశుధ్యం, మురుగు కాల్వల నిర్వహణ జరగడం లేదని ఆరోపించారు. దోమలు వ్యాప్తి చెంది ప్రజలు జ్వరాలకు గురవుతున్నారని ఆరోపించారు. వైద్య ఎమర్జెన్సీని కోరుతూ గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు చేయాలని, ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయాలని ఈనెల 21న రాష్ట్ర వ్యాప్తంగా మండల మండల్ పరిషత్ కార్యాలయాల ఎదుట ధర్నా కార్యక్రమాలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

కూతురి అప్పగింతలు చేస్తూ కుప్పకూలిన తల్లి

- గుండెపోటుతో వధువు తల్లి మృతి
- ఉదయం పెళ్లి.. సాయంత్రం విషాదం
- ఖమ్మం జిల్లా కామేపల్లి మండలంలో ఘటన


కల్యాణి(ఫైల్)

కామేపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఉదయం ఆ ఇంట పెళ్లి బాజాలు మోగాయి. బంధుమిత్రులంతా వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. పందిట్లో ఆడిపాడారు. విందు స్వీకరించారు. అంతా ఆనందోత్సాహాల మధ్య ఆ ఇంటి ఆడబిడ్డ వివాహ వేడుక జరిగిందనుకున్న తరుణంలో ఆ ఇల్లాలు గుండెపోటుతో కుప్పకూలింది. అల్లుడు, వియ్యపువారితో కూతురి అప్పగింతలు చేస్తూ భావోద్వేగానికి గురై.. గుండెపోటుతో మృతిచెందింది. ఈ విషాదకర సంఘటన ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం అబ్బాసుపురం గ్రామంలో ఆదివారం జరిగింది. అబ్బాసుపురం గ్రామానికి చెందిన బానోత్ మోహిలాల్, కల్యాణి(40) దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఓ కుమారుడు ఉన్నారు. వారిలో పెద్ద కుమార్తె సింధు వివాహం టేకులపల్లికి చెందిన బాలాజీతో ఆదివారం ఉదయం వారి ఇంట వైభవంగా జరిగింది. వివాహ అనంతరం సాయంత్రం సమయంలో అప్పగింతల కార్యక్రమం జరుగుతోంది. ఈ క్రమంలో అల్లుడితో పాటు వియ్యపువారికి కూతురిని అప్పగిస్తూ.. కల్యాణి కన్నీటి పర్యంతమైంది. అదే సమయంలో మరింత భావోద్వేగానికి గురైన ఆమె గుండెపోటుతో కుప్పకూలింది. దీంతో ఆమెను ఆస్పత్రికి తరలించే ప్రయత్నించారు. కానీ అప్పటికే ఆమె మృతిచెందడంతో పచ్చని పెళ్లింట విషాదం అలముకుంది.

ఖమ్మం జిల్లా బాల్ బ్యాడ్మింటన్ జట్లు సిద్ధం

ఖమ్మం స్పోర్ట్స్ ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా గోలేటిలో ఈ నెల 23, 24 తేదీలలో జరిగే 71వ రాష్ట్ర స్థాయి సీనియర్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీలలో పాల్గొనే జిల్లా జట్లను ఆదివారం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో ఎంపిక చేశారు. ఎంపికలకు ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 40 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపికల్లో ప్రతిభ చూపి జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారుల వివరాలను జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వేజెళ్ల సురేష్, బొంతు శ్రీనివాసరావు ప్రకటించారు. బాలికల జట్టులో జస్వతి, శ్రీహర్షిణి, మధులత, ఆకాంక్ష, సాహితి, రాజేశ్వరి, కరీనా, మనీషా, స్మైలి, నవ్య, ఊహిత, అక్షయ బాలుర జట్టులోగోపి, శ్రీకాంత్, పవన్, కళ్యాణ్, మజ్ను, నూనావత్ గోపి, నవీన్, ప్రశాంత్, లాకేష్, విజయ్ కళ్యాణ్, జయదీప్‌లు ఎంపికయ్యారు. నన్నక బాబు, ఆనంద్, దయాకర్ తదితరులు సమీక్షించారు.


పోటీలకు ఎంపికైన బాలికల జట్టు

ఖమ్మం జిల్లా విద్యుత్ ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక

- అధ్యక్ష, కార్యదర్శులుగా వెంకట్, నాగమల్లేశ్వరరావు


ఎన్నికైన నూతన కార్యవర్గం

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పవర్ డిప్లమో ఇంజనీర్స్ అసోసియేషన్ ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎన్నికలు ఆదివారం ఖమ్మం నగరంలో నిర్వహించారు. ఎస్పీడీసీఎల్ అధ్యక్షుడు ఎం. ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాకు విడివిడిగా ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. ఏ జిల్లాకు ఆ జిల్లా అధ్యక్ష, కార్యదర్శలు, కార్యవర్గాన్ని ఎన్నిక చేశారు. ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శలుగా పీ. వెంకట్, నాగమల్లేశ్వరరావు, అర్గనైజింగ్ సెక్రటరీగా ఎం నాగరాజు, కోశాధికారిగా కుమారి నవ్యశ్రీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సెంట్రల్ కమిటీలోకి ఉషారాణి, శ్రీనివాస్, క్రాంతిసింహ, సందీప్‌రెడ్డి, రామ్మోహన్, మదార్‌సాహెబ్, నరేశ్, మైథిలి, జిలానిలకు కీలక బాధ్యతలు ఇచ్చారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో భక్తుల కోలాహలం

పాల్వంచ రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : పాల్వంచ మండలంలోని కేపీ జగన్నాథపురంలోని పెద్దమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. జిల్లా నలుమూలల నుంచి తరలొచ్చిన వేలాదిమంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. తలనీలాలు, అమ్మవారికి నైవేద్యం, చీరసారె సమర్పించుకున్నారు. దేవస్థానం అధికారులు, కమిటీ సభ్యులు భక్తులకు తగిన సౌకర్యాలను కల్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమాలను దేవస్థానం ఈవో రజనికుమారి, దేవాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, సభ్యులు చీకటి కార్తీక్, జోషి తదితరులు ఉన్నారు.


ఆలయంలో బారులు తీరిన భక్తులు

ముమ్మరంగా వరినాట్లు

- పెరిగిన సాగు ఖర్చులు
- తగ్గిన కౌలు రైతులు
- బోనస్ ఇస్తున్నా సన్నాలపై రైతుల అనాసక్తి



ఎర్రుపాలెం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఈఏడాది ఖరీఫ్‌లో ఆగస్టు మొదటి వారం నుంచి రైతులు వరిసాగు ముమ్మరంగా చేశారు. గత కొద్దికాలంగా కురుస్తున్న వర్షాలకు మండలంలో విస్తారంగా వరినాట్లకు మాగాణులు సిద్ధమయ్యాయి. మండలంలో నాగార్జున సాగర్ ఆయకట్టు కింద 5,434, కట్టలేరు కింద 2,905, బోర్లు ద్వారా 1,552, బావుల ద్వారా 724, ఎకరాలు ఇలా సుమారు11వేల ఎకరాల్లో రైతులు వరిసాగు చేపడుతున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. వర్షాధార భూముల్లో కూడా రైతులు వరిసాగు చేపడుతున్నట్టు సమాచారం. కాగా గతంతో పోలిస్తే సాగు విస్తీర్ణంలో పెరిగే అవకాశం లేదని వారు చెబుతున్నారు. పైగాఏడాదికేడాది ఖర్చులు పెరగడంతో కొత్తగా వరిసాగుకు రైతులు ఆసక్తి చూపడంలేదు విత్తన వడ్లకు రూ.2వేలు, ట్రిల్లర్, గేజీలు కొట్టినందుకు2దఫాలుకు ఎకరానికి రూ.4వేలునుంచి 6వేలు, నాటేందుకు రూ.4,500, నారు మోసేందుకు రూ.800, కాడి ఎద్దులకు, ట్రాక్టర్‌కు రూ.2,500, ఇలా ఎకరానికి రూ.12వేల నుంచి 15వేల వరకు ఖర్చులు అవుతున్నాయని వాపోతున్నారు. కూలీలకు డిమాండ్ పెరగడంతో కొన్నిచోట్ల బెంగాల్, ఇతర ప్రాంతాలనుంచి వచ్చి వరినాట్లు వేస్తున్నారు. ఎకరానికి రూ.5వేల వరకు కూలీల ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు. సాగు ఖర్చులు పెరగడంతో కౌలు రైతులు వరిసాగుకు ముందకు రావడంలేదు. దీంతో భూయజమానులే సొంతంగా సాగు చేసుకుంటున్నారు.


ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న రైతు

సన్నాలు సాగుచేయాలని ప్రభుత్వ యోచన

తెలంగాణ ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధరతోపాటు సన్నవడ్లసాగు పెంచాలనిసన్నవడ్లు సాగు చేసే రైతులకు క్వింటాకు రూ.500బోనస్‌ను ప్రకటించింది. గతేడాది కూడా ఈ ప్రయత్నం చాలా వరకు విజయవంతం అయింది. కానీ చాలామంది రైతులకు ఈపేరకమైన వరి వేస్తే బోనస్ వస్తుందో తెలియక సతమతమైన దాఖలాలు లేకపోలేదు.

ప్రభుత్వం గతేడాది నుంచిసన్నాలు సాగు చేసే రైతులకు క్వింటాకు రూ.500బోనస్ అందించినా మండలంలో రైతులు సన్నాలుసాగుపై ఆసక్తి చూపడంలేదు. మండలంలో గత రబీ లో 908 మంది రైతులకు 42,254 క్వింటాళ్లకు రూ.2,11,27,000 లను బోనస్‌గా అందించింది. కానీ ఎర్రుపాలెం మండలంలో వాతావరణ పరిస్థితులు భూములు స్వభావం రిత్యా సన్నాలు సాగు చేసే అవకాశం ఎక్కువగా లేదని రైతులు చెబుతున్నారు. దొడ్డువడ్లసాగులో యాజమాన్య పద్ధతలు పట్టించుకోకపోయినా సగటు దిగుబడితోపాటు పంట చేతికొస్తుంది. ఈప్రధానమైన కారణాలతో మండలంలో సగటును 200-300 ఎకరాలు మినహా సన్నాలుసాగుకు రైతులు ఆసక్తి చూపడంలేదు.

సెల్ఫీ సరదా.. ప్రాణం తీసింది

- జలపాతంలో గల్లంతైన యువకుడి మృతి
- మహబూబాబాద్ జిల్లా ఏడుబావుల వద్ద ఘటన
- మృతుడిది ఖమ్మం జిల్లా జన్నారం
- మూడేళ్ల క్రితంవాగులో పడి అన్న మరణం

ఏన్కూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సెల్ఫీ సరదా.. ఆ యువకుడి ప్రాణాన్ని తీసింది. స్నేహితులతో కలిసి మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం ఏడుబావుల జలపాతం వద్దకు వెళ్లిన ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం జన్నారం గ్రామానికి చెందిన పామర్తి ప్రేమ్‌కుమార్ (23) శనివారం గల్లంతైన విషయం తెలిసిందే. ఆ యువకుడి మృతదేహం ఆదివారం లభ్యమైంది. ఏడుబావుల జలపాతాన్ని చూసేందుకు స్నేహితులతో కలిసి వెళ్లిన ప్రేమ్‌కుమార్ అక్కడ సరదాగా కొద్దిసేపు గడిపారు. సెల్ఫీ దిగే క్రమంలో జలపాతంలో పడిపోయి మృతిచెదాడు. గమనించిన స్నేహితులు తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. ఆదివారం ఉదయం మృతదేహం లభ్యం కాగా.. సాయంత్రానికి అతడి స్వగ్రామమైన జన్నారం తీసుకొచ్చారు. ప్రేమ్ కుమార్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పామర్తి శ్రీను, లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు కాగా పెద్ద కుమారుడైన విజయ్ 3ఏళ్ల క్రితం జన్నారం వాగులో పడి మృతిచెందగా.. ఇప్పుడు చిన్న కుమారుడు ప్రేమ్ కుమార్ కూడా నీటికే బలవవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడు ఐటీఐ చదువుకుని హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడని తండ్రి తెలిపారు.

తీరిన విద్యార్థినుల కష్టాలు..

- ఉపయోగంలోకి గిరిజన ఐటీఐ భవనం
- హర్షం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



సామగ్రిని తరలిస్తున్న సిబ్బంది

చుంచుపల్లి, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): 2016వ సంవత్సరంలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రాష్ట్రంలోనే తొలి గిరిజన ఐటీఐ కళాశాలను రూ.5.50 కోట్లతో నిధులను విడుదల చేసి నిర్మించిన భవనం ఎట్టకేలకు తెరుచుకుంది. జిల్లాలో మావోయిస్ట్ ప్రభావిత ప్రాంతాల్లోని యువత నక్సల్స్ వైపు ఆకర్షించబడకుండా పదేళ్ల కిందట భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రానికి అతి సమీపంలోని చుంచుపల్లి మండలంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక గిరిజన ఐటీఐ కళాశాలను నిర్మించారు. గిరిజన విద్యార్థులకు సాంకేతిక విద్యను పూర్తి స్థాయిలో ఉచితంగా అందించేందుకు కళాశాల భవనంతో పాటు, వసతి గృహాలను నిర్మించారు. చుంచుపల్లి తండా గ్రామ పంచాయతీ పరిధిలో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మాణాలు పూర్తి చేసి రుద్రంపూర్, ఐటీఐ కళాశాలకు అప్పగించిన ఇప్పటి వరకు ప్రారంభానికి నోచుకోలేదు. ఈ అంశాలను, పలు సమస్యలను ఈ ఏడాది 2025 మార్చి 3న ఆంధ్రజ్యోతి దిన పత్రికలో ప్రచురించారు. వదిలేశారు...? అనే కథనం ప్రచురితం అయ్యి వెలుగులోకి తీసుకువచ్చింది.

గిరిజన ఐటీఐ కళాశాల భవనం నిర్మించిన నాటి నుంచి నేటి వరకు నిరుపయోగం ఉంది. ఈ నూతన భవనంలోకి కొత్తగూడెం ప్రభుత్వ నర్సింగ్ బాలికల కళాశాలను, వసతి గృహాలను తాత్కాలికంగా కొనసాగించేందుకు కలెక్టర్ అనుమతిని కళాశాల యాజమాన్యం తీసుకున్నట్లు తెలుస్తుంది. దీంతో ఇన్నాళ్ల నిరుపయోగంగా ఉన్న భవనం పాఠ్యాంశ తరగతులతో పాటు వసతి గృహాలలో విద్యార్థులతో కళ కళలాడుతుంది. ప్రస్తుతం 3 బ్యాచ్‌లకు చెందిన 180 మంది విద్యార్థినిలు నర్సింగ్ విద్యను అభ్యసిస్తుండగా, 2025-2026 విద్యా సంవత్సరానికి గాను మరో 60 మంది విద్యార్థినులకు అడ్మిషన్లు ఈ ఏడాది నవంబర్ నెలలో నాలుగో బ్యాచ్‌గా రానున్నట్లు తెలుస్తుంది.

కొత్తగూడెం పట్టణంలోని రామా టాకీస్ ఏరియాలో గత మూడేళ్లుగా ప్రభుత్వ నర్సింగ్ బాలికల కళాశాల కొనసాగడంతో విద్యార్థులు పడిన ఇబ్బందులు వర్ణానీతం. విద్యార్థినులు పడుతున్న ఇబ్బందులను స్పందించిన కలెక్టర్ చుంచుపల్లి తండాలోని గిరిజన ఐటీఐ భవనంలోనికి నర్సింగ్ విద్యను కొనసాగించుకోమని అనుమతి ఇవ్వడంతో హర్షం వ్యక్తం చేశారు. నర్సింగ్ విద్య వేరే చోటికి కొనసాగిన సొంత భవనం లేకపోవడంతో ఆ వెలితి ఇంకా వేధిస్తూనే ఉందనే సందేహాలు వినపడుతున్నాయి. ప్రభుత్వం గతంలో నిర్మించిన బాలికల నర్సింగ్ కళాశాల భవనంలో ప్రస్తుతం కొత్తగూడెం మెడికల్ కళాశాల కొనసాగుతుండడం కోసం మెరుపు. కొత్తగూడెం మెడికల్ కళాశాల భవనాలు పూర్తి అయితేనే నర్సింగ్ విద్య సమస్యలు తీరనున్నాయి.



ఆంధ్రజ్యోతి KHAMMAM CITY
సోమవారం 18 ఆగస్టు 2025
● ఖమ్మం ● రఘునాథపాలెం
● ఖమ్మం రూరల్
● తిరుమలాయపాలెం
● కూసుమంచి
● నేలకొండపల్లి ● కామేపల్లి
ఖమ్మం సిటీ
ZONE 8

వర్షాలకు నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వాలి

తిరుమలాయపాలెం,ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): ఇటీవల వర్షాలతో పంట నష్టం జరిగిన రైతులకు పరిహారం ఇవ్వాలని టీడీపీ జిల్లానాయకుడు కొండబాల కరుణాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం తిరుమలాయపాలెంలో పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈఏడాది ఖరీఫ్‌లో రైతులు పత్తి, వరి, పెసర తదితర పంటలు సాగుచేశారని, భారీవర్షాలతో పంటలు దెబ్బతిన్నాయని, వాటికి పరిహారం ఇవ్వాలని కోరారు. బీరోలు-బంధంపల్లి, మేడిదపల్లి-సుబ్లేడు, రఘునాథపాలెం-కాకరవాయి, జల్లేపల్లి వరకు చెరవు అలుగుల వద్ద కల్వర్టులు నిర్మించాలని కోరారు. ఈకార్యక్రమంలో పార్టీ జిల్లానాయకుల కొప్పుల వెంకటరావు, నామాప్రసాద్, కొలిశెట్టి భిక్షం, మల్లీడి నాగన్న, మల్లీడి రమేష్ పాల్గొన్నారు.

ఏభైఏళ్ల ఆనందోత్సాహం

నేలకొండపల్లిలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నేలకొండపల్లి, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): వారంతా నేలకొండపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1974-75లో పదోతరగతి చదువుకున్నారు. వివిధ వృత్తుల్లో స్థిరపడ్డారు. కొంతమంది ప్రభుత్వ ఉద్యోగాలు చేసి రైటైర్ అయ్యారు. అటువంటి వారంతా ఆదివారం నేలకొండపల్లిలో తాము చదువుకున్న పాఠశాలలో కలుసుకున్నారు. అదో అపూర్వ కలయిక. దాదాపుగా 50సంవత్సరాల అనంతరం కలుసుకున్న మిత్రులు భావోద్వేగానికి గురయ్యారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ ఆప్యాయంగా మాట్లాడుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో తొలుత తమతో కలిసి చదువుకున్న వారిలో మృతి చెందిన వారికి నివాళులర్పించారు.చదువుకునే రోజుల్లో చేసిన అల్లరి పనులు, ఆకతాయి పనుల గురించి నెమరేసుకున్నారు. గండికోట బాలమురళీకృష్ణ, మన్నె కోటేశ్వరరావు, వేల్పుల గోపీనాథ్, కొల్లి హరీష్‌బాబు ఈ సమ్మేళనాన్ని నిర్వహించారు. వంగవేటి భాస్కరరావు, ముదిగొండ మధు, వంగవేటి నళిని, నున్నా విజయ, రాజపుత్ర రమేష్‌సింగ్, దుర్గ, పార్వతి, గెల్లా వెంకట రమణగుప్తా, జక్కనాచారి పాల్గొన్నారు.



1974-75లో పదోతరగతి చదివిన విద్యార్థులు

ప్రయాణం నరకప్రాయం

చిత్తడి, గుంతలమయంగా పోలేపల్లిలో రహదారి

ఖమ్మంరూరల్‌మండలం పోలేపల్లిలో ఇటీవల కురిసిన వర్షాలతో రోడ్డంతా చిత్తడిగా మారింది. కేంద్రీయ విద్యాలయానికి పోయే మార్గంలో ప్రయాణం నరకప్రాయంగా మారింది. రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు పడి వాహనదారులు, చివరకు పాదచారులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బురద నీటితో దుర్గంధం వెదజల్లుతోంది.
'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం



సాహిత్య పురస్కారాల ప్రదానం



అవార్డును అందిస్తున్న నిర్వాహకులు

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): హాసిని రామచంద్ర లిటరరీ ఫౌండేషన్ 2025 సాహిత్య పురస్కారాల ప్రదానోత్సవం ఆదివారం ఖమ్మం గట్టయ్య సెంటర్‌లోని రోటరీ లింబ్ సెంటర్‌లో నిర్వహించారు. హెచ్‌ఆర్‌సీ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు తోట సుభాషిణి అధ్యక్షతన జరిగిన ఈసభలో ప్రముఖ సాహితీవేత్త మువ్వా శ్రీనివాసరావు, కేంద్ర సాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యుడు ప్రసేన్, ప్రముఖ కథకుడు వంశీకృష్ణ, ప్రముఖ కవి శ్రీరాం పుప్పాల, తదితరులు పాల్గొన్నారు.. హెచ్‌ఆర్‌సీ 2025 సాహితీ పురస్కారాన్ని ప్రముఖ కవి విమర్శకుడు అబ్దుల్ రజా హుస్సేన్ స్వీకరించారు.. కథల పోటీల విజేతలు ప్రథమ ఆర్‌సీ కృష్ణస్వామిరాజు, ద్వితియ స్వర్ణ కిలారి, తృతియ రోహిణివంజారి అందుకున్నారు. కవిత్వ విభాగంలో పిన్నంశెట్టి కిషన్, కోసూరి రవికుమార్, రేణుక అయోల ప్రథమ, ద్వితీయ తృతీయ బహుమతులు స్వీకరించారు.. ఇబ్రహీం నిర్గున్, షుకూర్ మియా, కట్టా శ్రీనివాస్,కపిల రాం కుమార్, పోతగాని సత్య నారాయణ, కటుకోజ్వల రమేష్, ధరణికోట రమేష ఉరిమళ్ళ సునంద,సాధనా తేరాల, తదితరులు పాల్గొన్నారు..

డెంగీ లక్షణాలతో విద్యార్థిని మృతి

కొణిజర్ల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తనికెళ్ళ గ్రామానికి చెందిన తద్దె స్వాతి(18) డెంగీ లక్షణాలతో శనివారం రాత్రి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మృతి చెందింది. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. స్వాతి ఖమ్మంలోని ఓప్రవేటు కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతూ తొలుత ఖమ్మంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందింది. పరిస్థితి విషమంగా ఉందని తెలపడంతో కుటుంబసభ్యులు హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్సపొందుతూ చనిపోగా కుటుంబసభ్యులు ఆదివారం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు.

ఘనంగా బోనాల వేడుకలు

శ్రావణమాసం చివరి ఆదివారం కావటంతో పోటెత్తిన భక్తులు







ముత్యాలమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు, నాయకన్‌గూడెం గ్రామంలో బోనాల కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం చివరి ఆదివారం సందర్భంగా జిల్లావ్యాప్తంగా బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. రెడ్డిపల్లి మారెమ్మ తల్లి ఆలయానికి భక్తుల అధిక సంఖ్యలో హాజరయ్యారు. అమ్మవారిని 100కేజీల నిమ్మకాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. మాపిల్లాపాపలను, చల్లంగా చూడు, పాడిపంటలు సంవృద్ధిగా అందించాలని వేడుకున్నారు. జిల్లాలో ముత్యాలమ్మ, మైసమ్మ, మారెమ్మ, అంకమ్మ, ఎల్లమ్మ నూకాలమ్మ, పోచమ్మ, గంగమ్మ తల్లుల ఆలయాలలో భక్తులు బోనాలు సమర్పించారు. మహిళలు బోనాలు ఎత్తుకోని కోలాటాలు, డప్పువాయిద్యాల నడుమ అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. కొందరు మహిళలు బోనాలు ఇంటి వద్ద తయారు చేసుకోని రాగ, మరికొందరు ఆలయాల వద్ద బోనాలు తయారుచేసి అమ్మవారికి సమర్పించారు. నగరంలోని చర్చికాంపౌండ్ ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వేలాదిమంది భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. వరదయ్యనగర్‌లోని మైసమ్మ అమ్మవారి ఆలయంలో మహిళలు అధికసంఖ్యలో హాజరై బోనాలు సమర్పించారు. కైకొండాయిగుడెం రోడ్డులోని అంకమ్మ, మద్దిరావవమ్మ, మహాలక్ష్మిమ్మ ఆలయంలో అమ్మవార్లకు బోనాలు సమర్పిచారు. నగరంలోని ప్రకాష్‌నగర్ బ్రిడ్జి ప్రాంతంలోని గంగమ్మతల్లికి ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో బోనాలు సమర్పించారు. డిజేసౌండ్‌లతో, మేళతాళ్లాలతో సుమారు 200 మంది భక్తులు బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం లిమిటెడ్ ప్రకాష్‌నగర్ 28, 29 డివిజన్‌ల నాయకులు హైమావతి, విజయలక్ష్మీ, వెంకటేశ్వర్లు, నరసింహారావు, సభ్యులు పాల్గొన్నారు. 4వ డివిజన్‌లోని పెద్దమ్మ తల్లి ఆలయం, 1, 2, 3, 6వ డివిజన్‌లలోని ముత్యాలమ్మ ఆలయాలలో మొక్కులు చెల్లించారు.

ఘనంగా గంగమ్మతల్లి బోనాలు

కూసుమంచి: మండలంలోని నాయకన్‌గూడెంలో గంగమ్మ తల్లి బోనాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గంగపుత్ర మహిళలు ఇంటికో బోనం నెత్తిన ఎత్తుకుని ఊరేగింపు నిర్వహించారు. డీజేలతో ఊరేగింపుగా వెళ్లిన మహిళలు గంగమ్మతల్లికి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలు సమర్పించారు. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బోనాల జాతరలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కంచర్ల వీరారెడ్డి, బీష్మాచారి పలువురు నాయకులు పాల్గొన్నారు.

బోనాల జాతర

ఖమ్మంరూరల్: మండల పరిధిలోని తల్లంపాడు, నరసింహపురం, గుర్రాలపాడు, వెంకటగిరి తదితర గ్రామాల్లో ఆదివారం బోనాలు సమర్పించారు. గ్రామాల్లో మేళతాళాలతో సంబరాలు నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున బోనాలు ఎత్తుకుని గ్రామ దేవతలకు సమర్పించారు.



బల్లేపల్లిలో బోనాలతో మహిళా భక్తులు



ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో గంగమ్మ తల్లి బోనాలు



మారెమ్మ తల్లికి నిమ్మకాయలతో ప్రత్యేక అలంకరణ



రూరల్ మండలంలో బోనమెత్తిన మహిళలు



తల్లంపాడులో బోనాలు సమర్పించేందుకు వెళుతున్న భక్తులు



ముత్యాలమ్మ ఆలయంలో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

ఇళ్లపై విద్యుత్ తీగల తొలగింపు

నేలకొండపల్లి, ఆగస్టు17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో ఇళ్లపై నుంచి వెళుతున్న విద్యుత్ తీగలను అధికారులు తొలగించారు. మంత్రి శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు విద్యుత్ అధికారులు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆదివారం కోరట్లగూడెం గ్రామంలోని చర్చిపై నుంచి వెళుతున్న విద్యుత్ తీగలను సిబ్బంది తొలగించారు. విద్యుత్ తీగలను తొలగించేలా విద్యుత్ సిబ్బందిని ఆదేశించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కోరట్లగూడెం గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని సన్మానించారు. అంతకు ముందు నేలకొండపల్లిలోని మార్కెట్‌యార్డులో జరిగిన ఓ వివాహ కార్యక్రమంలో మంత్రి శ్రీనివాసరెడ్డి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. కాంగ్రెస్ సేవాదళ్ నియోజకవర్గ అధ్యక్షులు బచ్చలకూరి నాగరాజు, నజీర్, లాల్ పాషా, జామువా, నిర్మల, మైసయ్య, పృథ్వీ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న గోవిందరావు

నేలకొండపల్లి,ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మంగాపురంతండాలో 30 కుటుంబాలు బీఆర్ఎస్ నుంచి ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ జిల్లా నాయకుడు కొడాలి గోవిందరావు సమక్షంలో తండాకు చెందిన బీఆర్ఎస్ చిన్నతండా అధ్యక్షుడు తేజావత్ కోటేశ్వరరావు, కార్యదర్శి భూక్యా కృష్ణ, భూక్యా సునీల్, ఫాల్తియా వేణుగోపాల్, తేజావత్ నాగరాజు 30కుటుంబాలు బీఆర్ఎస్‌కు రాజీనామా చేఆరు. కాంగ్రెస్‌లో చేరారు. కొడాలి గోవిందరావు కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ధరావత్ బాలాజీ, సీతానాయక్, మైసా శంకర్, వెన్నపూసల సీతారాములు, శాఖమూరి రమేష్, కొర్లకుంట నాగేశ్వరరావు, తేజావత్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి: సీపీఎం



మాట్లాడుతున్న రమేష్

తిరుమలాయపాలెం, ఆగస్టు17 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని సీపీఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ డిమాండ్ చేశారు. ఆదివారం తిరుమలాయపాలెంలో వ్యవసాయ కార్మిక సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరుగ్యారంటీలను అమలు చేయాలన్నారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు, ఇళ్లస్థలాలు ఇవ్వాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థుల విజయానికి కార్యకర్తలు కృషిచేయాలన్నారు. ఈ సమావేశంలో ఎస్‌కే బషీరుద్దీన్, సీపీఎం మండల శాఖ అధ్యక్షుడు కొమ్ము శ్రీను,బింగి రమేష్, అంగిరేకుల నరసయ్య, మద్దినేని శ్రీనివాస్, కొలిచలం స్వామి, పప్పుల ప్రసాద్, దామోదర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటి పర్యటన

కూసుమంచి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పాలేరు నియోజకవర్గంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటించారు. వరుస శుభకార్యాలల్లో పాల్గొని ప్రజలతో మమేకమయ్యారు. వధూవరులను ఆశీర్వదించి పట్టు వస్త్రాలనుకానుకగా ఇచ్చారు. మంత్రి వెంట గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఇరిగేషన్ చైర్మన్ మువ్వ విజయ్‌బాబు, టీపీసీసీ ప్రధానకార్యదర్శి జేబీ స్వర్ణకుమారి పాల్గొన్నారు.

డిగ్రీ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ డిగ్రీకళాశాల 1981-84 బీఏ (ఈపీపీ) బ్యాచ్ పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నగరంలోని ఓహోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా అందరి ఫొటోలు, చిరునామాలతో కూడిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. 70సంవత్సరాలు దాటిన చంద్రయ్య, రామారావును ఘనంగా సన్మానించారు. ఏటా ఆత్మీసమ్మేళనాలు నిర్వహించుకొని, సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమాన్ని జమిల్ పఠాన్, శ్రీహరి, కె.నర్సయ్య, హరినాథ్, సుదర్శన్, రౌతు రవి, ఎస్కే బాబు పాల్గొన్నారు.

పెసర రైతులను ఆదుకోవాలి

కొణిజర్ల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా చేతికి వచ్చిన పెసరపంట పూర్తిగా దెబ్బతిన్నదని, నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే బానోతు చంద్రావతి కోరారు. ఆదివారం మండల పరిధిలోని అమ్మపాలెం గ్రామంలో వర్షాలకు దెబ్బతిన్న పెసరపంటలను పరిశీలించారు. చేతికొచ్చిన పెసరపంట వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్నదని, ప్రభుత్వం తక్షణమే వర్షాలకు నష్టపోయిన పంటపొలాలను పరిశీలించి, పంటనష్టాన్ని అంచనావేసి రైతులను ఆదుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కిలారు మాధవరావు, ఖాదర్‌బాబు, చిలుకూరి నాగేంద్ర, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



తాళం వేయాలంటే.. భయం.. భయం!

(5వ పేజీ తరువాయి)

ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదంతా పోలీసు అధికారులకు తెలిసినా.. ఫిర్యాదు వచ్చిన వాటికి కేసులు నమోదు చేయడం తప్ప దొంగలను పట్టుకునేందుకు ఎలాంటి శ్రద్ధ చూపడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అప్పుడప్పుడు రికవరీలు...

జిల్లా వ్యాప్తంగా చోరీలు ఎక్కువగా జరుగుతుండగా పోలీసులు మాత్రం అంతంత మాత్రంగానే దొంగలను పట్టుకుంటున్నారని, వారిని కూడా అరెస్టు చూపడం లేదని, రికవరీలు చేయడం అస్సలు మానేసారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో జరిగిన దొంగతనాలలో పట్టుబడిన దొంగలను మాత్రమే పోలీసులు గుర్తిస్తున్నారు కానీ కొత్త వారిని పట్టుకోవడంలో అలసత్వం వహిస్తున్నారన్న అపవాదు మూటగట్టుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది జూలై నెల 31వరకు సుమారు 350కేసులకు పైగా దొంగతనాల కేసులు ఆయా పోలీస్ స్టేషన్లలో నమోదవగా.. వాటిల్లో 50శాతం కన్నా తక్కువ కేసులు మాత్రమే రికవరీ జరిగాయాని, దొంగలను రిమాండ్ చేశారని సమాచారం.

నిఘా పెంచాలి.. దొంగలను పట్టుకోవాలి

సొత్తు చోరీకి గురైన వారు ఎప్పుడు దొంగలను పట్టుకుంటారా.. ఎప్పుడు మా సొత్తు రికవరీ అవుతుంతా అని అడుగుతూ స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నామని ఓ వ్యక్తి అనడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. కష్టపడి చిన్న ఉద్యోగం చేసుకుంటూ డబ్బు దాచుకుని భార్యకు చేయించిన బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తి చోరీ చేయడం బాధను మిగిల్చిందని, ఆ దొంగను గుర్తించి బంగారం రికవరీ చేయాలని సదరు బాధితుడు వేడుకుంటున్నాడు. అదేవిధంగా అర్ధరాత్రి సమయాల్లో నిఘా పెంచాలని, పోలీసులు దొంగలను పట్టుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు

మేయర్ పునుకొల్లు నీరజ

ఖమ్మంకార్పొరేషన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ రాజ్యంలో పూరిళ్లు లేని నియోజకవర్గంగా ఖమ్మం మారబోతుందని ఈమేరకు అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని మేయర్ పునుకొల్లు నీరజ, ఖమ్మం ఏఎంసీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు పేర్కొన్నారు. ఆదివారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయంలో తుమ్మల యుగంధర్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. 58వ డివిజన్‌లోని 61 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఖమ్మం నగరంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప మేయర్ ఫాతిమాజోహారా, నాయకులు శెట్టి రంగారావు పాల్గొన్నారు.



పట్టాలు పంపిణీ చేస్తున్న మేయర్ పునుకొల్లు నీరజ, తుమ్మల యుగంధర్



నేరాల నియంత్రణలో దిట్ట.. ఏన్కూరు ఎస్ఐ

భట్టి విక్రమార్క చేతులమీదుగా అవార్డు అందుకున్న ఎస్ఐ రఫి

ఏన్కూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): నేర నియంత్రణను అదుపు చేస్తూ, విధులను సమర్థవంతంగా నిర్వహిస్తున్నందుకుగాను ఏన్కూరు ఎస్ఐ మహ్మద్ ఉఫాతుల్ రఫి ఉత్తమ ఎస్ఐగా ఎంపికయ్యారు. ఈమేరకు స్వాతంత్ర దినోత్సవం నాడు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఎస్ఐ రఫి తాను విధులు నిర్వహిస్తున్న ప్రతి పోలీసు స్టేషన్‌లో విధులు సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు.

యూరియా కొరత లేకుండా చూడాలి

కొణిజర్ల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా కొరత లేకుండ చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అఖిలభారత రైతుకూలిసంఘం జిల్లా నాయకులు షేక్ ఖాసీం తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో యూరియా కొరత రైతులను వేదిస్తున్న ఎవరూ పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్న యూరియా కొరత వస్తోందని, ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు సరిపడా యూరియాను అందించాలని డిమాండ్ చేశారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ భారవి

వైరా, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల అన్నివర్గాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ప్రముఖ వైద్యుడు చీకటి భారవి సూచించాడు. బోడేపూడి కళానిలయం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వైద్యశిబిరంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలంలో వచ్చే డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ ఇతర సీజనల్ వ్యాధుల గురించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోగులను డాక్టర్లు భారవి, పిల్లలమర్రి సుబ్బారావు, రమణారెడ్డి పరీక్షించారు. కంటి వైద్యపరీక్షలు కూడా చేశారు. రాయితీపై మందులు పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ బొంతు సమత, బోడేపూడి కళానిలయ సంస్థ కార్యదర్శి బొంతు రాంబాబు, నిర్వాహకులు సుంకర సుధాకర్, చింతనిప్పు చలపతిరావు, గుడిమెట్ల రజిత, మోహన్‌రావు, మల్లెంపాటి ప్రసాద్, మందడపు నాగేశ్వరరావు, కంభంపాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

డెంగీ లక్షణాలతో విద్యార్థిని మృతి

కొణిజర్ల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తనికెళ్ల గ్రామానికి చెందిన తద్దె స్వాతి(18) డెంగీ లక్షణాలతో శనివారం రాత్రి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మృతి చెందింది. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. స్వాతి ఖమ్మంలోని ఓ ప్రవేటు కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. గత నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతూ తొలుత ఖమ్మంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందింది. పరిస్థితి విషమంగా ఉందని తెలపడంతో కుటుంబసభ్యులు హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్సపొందుతూ చనిపోగా కుటుంబసభ్యులు ఆదివారం మృత దేహన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. స్థానికులు కుటుంబసభ్యులు డెంగీ జ్వరం అంటునప్పటికి ప్రభుత్వ వైద్యాధికారులు నిర్ధారించాల్సి ఉంది.

గుబ్బగుర్తి గ్రామంలో

మండల పరిధిలోని గుబ్బగుర్తి గ్రామానికి చెందిన బలమాల ప్రసాద్, అనూష కుమారుడు బలమాల వినయ్(5) గత ఐదు రోజులుగా జ్వరంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి వినయ్‌కు జ్వరం వస్తుండడంతో ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చూపిస్తున్నారు. ప్లేట్లెట్స్ పూర్తిగా పడిపోవడంతో వైద్యుల సలహామేరకు హైదరాబాద్ తీసుకువెళ్తుండగా మృతి చెందాడు. బాలుడు మృతి చెండడంతో కుటుంబసభ్యులు బోరున విలపిస్తున్నారు. డెంగీతో మృతి చెందాడని కుటుంబ సభ్యులు స్థానికులు తెలుపుతున్న వైద్యాధికారులు నిర్ధారించాల్సి ఉంది.

వంగూరికి గౌరవ డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ అందుకుంటున్న వెంకటేశ్వరరావు

తల్లాడ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం నూతన్‌కల్ గ్రామానికి చెందిన ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు వంగూరి వెంకటేశ్వరరావు ఇంటర్నేషనల్ పీస్ యూనివర్శిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. రక్తదానం, అవయవదానం, పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషిచేసినందుకుగాను వెంకటేశ్వరరావుకు ఇంటర్నేషనల్ పీస్ యూనివర్శిటీ పాండిచ్చేరీలో పీస్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర సురేష్‌బాబు చేతులమీదుగా డాక్టరేట్‌ను ప్రదానం చేశారు.

శిథిలావస్థలో కల్లూరు సీహెచ్‌సీ భవనం

- బిక్కు బిక్కు మంటున్న వైద్యులు
- భయాందోళనలో రోగులు
- సగటున రోజుకు 100 నుంచి 150 ఓపీ
- ప్రారంభానికి నోచుకోని నూతన భవనం

కల్లూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని ప్రాంతీయ ప్రభుత్వ వైద్యశాల పాత భవనం శిథిలావస్థకు చేరింది. ఇదే భవనంలో సదరు వైద్యులు, సిబ్బంది ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు. దశాబ్దల క్రితం నిర్మించిన ఈ భవనం శిథిలం కావడంతో స్లాబ్‌పై భాగం నుంచి పెచ్చులు ఊడి ఏ క్షణంలో ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ఇటు వైద్యులు, మరో వైపున రోగులు బిక్కు బిక్కు మంటు కాలం గడుపుతున్నారు. ఈ భవనంలో స్లాబ్ భాగం అంత శిథిలావస్థకు చేరుకోవడంతో వైద్యులు, రోగులు, మందుల గదితోపాటుగా రోగులు నిరీక్షించే హాల్, డ్రెస్సింగ్ గదుల్లో వర్షపు నీటి దారాల స్లాబ్ భాగం నుంచి కారుతుండడంతో నడవలేని పరిస్థితి ఏర్పడింది. కల్లూరు పీహెచ్‌సీలో వైద్యులు అందిస్తున్న సేవలపై ప్రజలకు విశ్వాసం కలగడంతో సగటున రోజుకు 100 నుంచి 150 మందికి పైగా రోగులు వస్తున్నారు. ఈ భవనంలోని స్లాబ్ కింది భాగం చువ్వలు వదిలి పెచ్చులు ఊడి పడడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అర్థంకాని పరిస్థితి. దీంతో క్షణం క్షణం ఒక నరకంలా ఆసుపత్రిలో వాతవరణం నెలకొన్నది. ఈ ఆసుపత్రిలో ఆరుగురు వైద్యులతో పాటుగా సిబ్బంది కలిపి 50 మంది వైద్య సేవలు అందిస్తున్నారు. ఆసుపత్రిలో చేరిన రోగులకు బెడ్లు లేక ఇబ్బంది పడుతన్నారు. గత మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షంతో ఈ ఆసుపత్రి భవనం మరింతగా దెబ్బతిన్నది. దీంతో లోపల భాగం వర్షపు నీరు చేరడంతో వైద్య సేవలకు అంతరాయం కలుగుతుంది. శనివారం నాడు కల్లూరు మండల సీపీఐ కార్యదర్శి దామాల దయాకర్ ఆసుపత్రి భవనంలో స్లాబ్ భాగం పెచ్చులు ఊడి పడిన దృశ్యాలను పరిశీలించారు. ప్రమాదకరంగా మారిన ఈ భవనం నుంచి నూతనంగా నిర్మించిన పీహెచ్‌సీ భవనాన్ని ప్రారంభిస్తే వైద్యులకు, రోగులకు అన్ని విధాలుగా ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు.

నూతన భవన ప్రారంభం ఇంకెన్నడు..

కల్లూరులో రెండు సంవత్సరాల క్రితం రూ.10 కోట్ల అంచనాతో చేపట్టిన నూతన పీహెచ్‌సీ భవనం నిర్మాణ పనులు పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఈ నూతన భవనం ప్రారంభిస్తే ప్రజలకు మరింతగా సేవలు అందే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికైన నూతన భవనం ప్రారంభంలో ప్రభుత్వ అధికారులు జాప్యం చేయకుండా సత్వరమే ప్రారంభించాల్సిన అవసరం ఉంది. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి కూడా దృష్టి సారించి ఈ భవనం ప్రారంభానికి సత్వర చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



శిథిలావస్థలో కల్లూరు సీహెచ్‌సీ పాత భవనం



వర్షపు నీటిని, ఊడిన పెచ్చులను శుభ్రం చేస్తున్న దృశ్యం



ప్రారంభానికి నోచుకోని నూతన భవనం

పెసర రైతులను ఆదుకోవాలి



అమ్మపాలెంలో పెసరపంటను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే చంద్రావతి

కొణిజర్ల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా చేతికి వచ్చిన పెసరపంట పూర్తిగా దెబ్బతిన్నదని, నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే బానోతు చంద్రావతి కోరారు. ఆదివారం మండల పరిధిలోని అమ్మపాలెం గ్రామంలో వర్షాలకు దెబ్బతిన్న పెసరపంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చేతికొచ్చిన పెసరపంట వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్నదని, ఆరుగాలం కష్టపడిన రైతులకు నిరాశే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే వర్షాలకు నష్టపోయిన పంటపొలాలను పరిశీలించి, పంటనష్టాన్ని అంచనావేసి రైతులను ఆదుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కిలారు మాదవరావు, ఖాదర్‌బాబు, చిలుకూరి నాగేంద్ర, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ బోనాలు

శ్రావణ మాసం చివరి ఆదివారం సందర్భంగా పలు ఆలయాల్లో మహిళా భక్తులు సాముహికంగా ముత్యాలమ్మ అమ్మవారికి అత్యంత భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు.



సత్తుపల్లిలో ముత్యాలమ్మకు పూజలు చేస్తున్న భక్తులు



వైరాలో ముత్యాలమ్మ జాతర ఊరేగింపు



తల్లాడలోని ముత్యాలమ్మ గుడి వద్ద భక్త జనసందోహం



బోనకల్‌లో బొడ్రాయి వద్ద పూజలు చేస్తున్న మహిళలు

ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్కలు నాటుతున్న దృశ్యం

వేంసూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని హైదరాబాద్ అరవిందో పార్మసీ వైస్ ప్రెసిడెంట్ నాగులవంచ శ్రీనివాసరావు సూచించారు. వేంసూరు మహాలక్ష్మీ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకుడు కుర్నవల్లి లక్ష్మయ్యబాబు, పాఠశాల హెచ్‌ఎం సుధాకర్‌రెడ్డి, గ్రామస్థులు ఎండీ.ఫైజుద్దీన్, నాయుడు వెంకటేశ్వరరావు, బింగి గాంధీబాబు, చింతా చెన్నారావు, యిజ్జగాని చిన్న వెంకటేశ్వరరావు, జనార్ధన్‌రావు, కొమ్మినవల్లి హరిబాబు, రాంబాబు, సుబ్బారావు పాల్గొన్నారు.

లింగాలలో ఇరువర్గాల ఘర్షణ

కల్లూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) కల్లూరు మండల పరిధిలోని లింగాల గ్రామంలో ఆదివారం రాత్రి ఓ సంఘటనలో వివాదం చెలరేగి ఇరు వర్గాల మధ్య ఘర్షణ వాతవరణం ఏర్పడింది. దీంతో సమాచారం అందుకుని స్థానిక పోలీసులు రంగ ప్రవేశం చేశారని తెలిసింది. ఈ సంఘటనకు సంబంధించి గ్రామస్థులు తెలిపిన సమాచార వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని లింగాల గ్రామానికి చెందిన కంచెపోగు లక్ష్మయ్య గ్రామ సమీపాన గల అర ఎకరం వ్యవసాయ భూమిలో పశువుల కోసం గ్రాసం పెంచాడు. ఆదివారం నాడు అదే గ్రామానికి చెందిన వాకదాని నవీన్, కృష్ణయ్యలకు సంబంధించిన గొర్రెలు లక్ష్మయ్య భూమిలో పెంచిన గ్రాసం మోపారన్న కారణంతో ఇరువురి మధ్య మాటమాట పెరిగడంతో నవీన్ లక్ష్మయ్యను కొట్టాగా తొడపై గాయం అయింది. దీంతో ఆగ్రహంతో ఈ ఘటనపై లక్షయ్య అనుచరులు కల్లూరు పోలీసులకు సమాచారం అందించారు. ఆ తరువాత రాత్రి 7 గంటలు దాటక లక్ష్మయ్య అనుచరులు కోపాద్రిక్తులై నవీన్ ఇంటపై దాడి చేసి అతడి తండ్రి కృష్ణయ్యను తీవ్రంగా కొట్టారని తెలిసింది. ఈ సంఘటనతో లింగాలలో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతవరణం నెలకొన్నది. దీంతో కల్లూరు పోలీసులు లింగాలకు చేరుకుని సమాచారం సేకరణతో పాటుగా ఉద్రిక్త పరిస్థితిని నివారించినట్లు తెలిసింది. ఇంత జరిగిన ఇరువర్గాల నుంచి పోలీసులకు ఫిర్యాదు అందలేదని స్థానిక నివాసుల ద్వారా తెలిసింది.

జడల కుటుంబానికి గోపాల్‌రెడ్డి పరామర్శ



జడల వెంకటేశ్వర్ల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న గోపాల్‌రెడ్డి

కారేపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన మలిదశ ఉద్యకారుడు జడల వెంకటేశ్వర్లు రెండు రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, తెలంగాణ వ్యవసాయ కమిషన్ కమిటి రాష్ట్ర సభ్యులు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి ఆదివారం జడల కుటుంబ సభ్యులను పరామర్శించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కేసీఆర్‌తో కలిసి ఉద్యమం చేసిన వ్యక్తి జడల వెంకటేశ్వర్లు అన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు గుజ్జర్లపూడి రాంబాబు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తలారి చంద్రప్రకాష్, డొంకెన రవి, సోమందుల నాగరాజు ఉన్నారు.

తాళం వేయాలంటే.. భయం.. భయం!

(5వ పేజీ తరువాయి)

ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదంతా పోలీసు అధికారులకు తెలిసినా.. ఫిర్యాదు వచ్చిన వాటికి కేసులు నమోదు చేయడం తప్ప దొంగలను పట్టుకునేందుకు ఎలాంటి శ్రద్ధ చూపడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అప్పుడప్పుడు రికవరీలు...

జిల్లా వ్యాప్తంగా చోరీలు ఎక్కువగా జరుగుతుండగా పోలీసులు మాత్రం అంతంత మత్రంగానే దొంగలను పట్టుకుంటున్నారని, వారిని కూడా అరెస్టు చూపడం లేదని, రికవరీలు చేయడం అస్సలు మానేసారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో జరిగిన దొంగతనాలలో పట్టుబడిన దొంగలను మాత్రమే పోలీసులు గుర్తిస్తున్నారు కానీ కొత్త వారిని పట్టుకోవడంలో అలసత్వం వహిస్తున్నారన్న అపవాదు మూటగట్టుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది జూలై నెల 31వరకు సుమారు 350కేసులకు పైగా దొంగతనాల కేసులు ఆయా పోలీస్ స్టేషన్లలో నమోదవగా.. వాటిల్లో 50శాతం కన్నా తక్కువ కేసులు మాత్రమే రికవరీ జరిగాయాని, దొంగలను గుర్తించి రిమాండ్ చేశారని సమాచారం.

నిఘా పెంచాలి.. దొంగలను పట్టుకోవాలి

సొత్తు చోరీకి గురైన వారు ఎప్పుడు దొంగలను పట్టుకుంటారా.. ఎప్పుడు మా సొత్తు రికవరీ అవుతుంతా అని అడుగుతూ స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నామని ఓ వ్యక్తి అనడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. కష్టపడి చిన్న ఉద్యోగం చేసుకుంటూ డబ్బు దాచుకుని భార్యకు చేయించిన బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేయడం బాధను మిగిల్చిందని, ఆ దొంగను గుర్తించి బంగారం రికవరీ చేయాలని సదరు బాధితుడు వేడుకుంటున్నాడు. అదేవిధంగా అర్ధరాత్రి సమాయాల్లో నిఘా పెంచాలని, పోలీసులు

సమస్యలపై నిరంతరం పోరు కమ్యూనిస్టులదే

బోనకల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడేది కమ్యూనిస్టులేనని సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు తెలిపారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో ఆదివారం జరిగిన ఆ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో పోటీ చేసేందుకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలన్నారు. జడ్పీటీసీ స్థానానికి జరగబోయే ఎన్నికల్లో పరిస్థితులను బట్టి పొత్తు పెట్టుకునే అభ్యర్థి గెలుపు కోసం పార్టీ నిర్ణయానికి కట్టుబడి పని చేయాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం గ్రామాల్లో పోరుబాట పట్టాలని సూచించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు ఏలూరి రమేష్, గుడిదె కృష్ణ, వంగాల నరసింహారావు, వంగాల హనుమంతరావు, చావా గోపి, గుడిదె నాగేశ్వరరావు పాల్గొన్నారు.



రంగా ఆశయ సాధనకు కృషిచేయాలి

తల్లాడ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి ప్రజానాయకడు స్వర్గీయ వంగవీటి మోహనరంగా ఆశయసాధనకు కృషిచేయాలని రంగా తనయుడు మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టారాగమయి కోరారు. రంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి తల్లాడ మండలం రామచంద్రాపురం గ్రామంలో వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని రాధాకృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వారు మాట్లాడుతూ.. తాను నమ్మిన సిద్ధాంతం, ప్రజల కోసం ప్రాణాలర్పించిన ప్రజా నాయకుడు రంగా అని కొనియాడారు. రాష్ట్రానికి సరిహద్దులు ఉంటాయి కాని అభిమానానికి హద్దులు ఉండవన్నారు. రంగా భౌతికంగా మన మధ్య లేకపోయినా అభిమానుల హృదయాల్లో ఆయన ఆశయాలు సజీవంగా నిలిచి ఉంటాయన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళులన్నారు. ముందుగా కల్లూరులోని కాకతీయ షుగర్ ఫ్యాక్టరీ వద్దకు అభిమానులు చేరుకుని వంగవీటి రాధాకృష్ణకు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి రామచంద్రాపురం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు చందు జనార్ధన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల గాంధీ, బాపట్లమురళి, యడవల్లి కృష్ణ, మునిసిపల్ మాజీచైర్మన్ కాపు సీతాలక్ష్మి, మాజీ వైస్‌చైర్మన్ తోట సుజలరాణి, పీసీసీప్రధాన కార్యదర్శి కట్టా రంగారావు, ఎం.మధు, సుధా నరసింహారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రిజర్వాయర్ రోడ్డు 34 అడుగులే..!

- ఆక్రమణలతో కుచించుకుపోయిన రోడ్డు..
- అయినా ఎవరికి పట్టని దయనీయ దుస్థితి

వైరా, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): అంతన్నారూ... ఇంతన్నారే చివరికి 34అడుగులకు వైరా రిజర్వాయర్ రోడ్డు కుచించుకుపోయింది. ఈ ఇరుకు రోడ్డులోనే అన్ని నిర్మాణాలు పూర్తిచేస్తున్నారు. వైరా రిజర్వాయర్ నిర్మాణ సమయంలో ఈ రోడ్డు 80నుంచి 100అడుగులతో ఉందని అప్పటి తరం వారు చెప్పినట్లు వైరాలో నానుడి. అయితే కబ్జాలు, ఆక్రమణల పరంపరతో ఈ రోడ్డు వెడల్పు 34అడుగులకు కుచించుకుపోయింది. 55నుంచి 60అడుగుల వెడల్పుతో ఈ రోడ్డును అభివృద్ధి చేస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు చేసిన ప్రకటనలకు ఇప్పుడు జరుగుతున్న నిర్మాణాల తీరుకు ఏమాత్రం పొంతనే లేకుండా పోయింది. రెండు అడుగుల వెడల్పుతో డివైడర్ దానికి రెండువైపులా 15అడుగుల చొప్పున 30అడుగులతో రూ.80లక్షల సుడా నిధులతో సిమెంట్ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. ఇప్పటివరకు రెండు అడుగుల వెడల్పుతో డివైడర్, 15అడుగుల వెడల్పుతో సీసీ రోడ్డును నిర్మించారు. మరోవైపు వెట్‌మిక్స్ వేసి సీసీ రోడ్డు నిర్మించలేదు. ఈ రోడ్డు మధ్యలోనే కరెంట్ స్తంభాలు ఉండటంతో సమస్యను 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తేవడంతో ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ వెంటనే స్పందించారు. మునిసిపాలిటీ కమిషనర్ చింతా వేణుతో ఎమ్మెల్యే మాట్లాడి కరెంట్ స్తంభాల షిఫ్టింగ్‌కు రూ.5.14లక్షల చెక్కును అందజేయించారు. తీరా ఇంత చేస్తే రోడ్డుకు ఒకటి నుంచి రెండు అడుగుల దూరంలోనే మళ్లీ కరెంట్ స్తంభాలు వేశారు. కరెంట్ లైన్ల ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదు. ఈ తరుణంలోనే అమృత్ పథకానికి చెందిన ఐదు అంగుళాలు, మూడు అంగుళాల పైపులైన్ల నిర్మాణం కోసం వెట్‌మిక్స్ వేసిన రోడ్డు మొత్తాన్ని అడ్డగోలుగా తవ్వారు. కేవలం సిమెంట్ రోడ్డు నిర్మించాల్సిన రోడ్డు అంచు కిందనే కరెంట్ స్తంభాల లోపల ఈ పైపులైన్ నిర్మిస్తున్నారు. పదిరోజుల కిందట పైపులైన్ల కోసం తవ్విన మట్టిని రోడ్డుకు అడ్డుగా పోశారు. సీసీ రోడ్డు, డివైడర్లు ఈ అమృత్ పథకం మంచినీటి పైపులైన్లు, కరెంట్ స్తంభాల నిర్మాణాలు మొత్తం 34అడుగుల వెడల్పులోనే సర్దుబాటు చేస్తుండటంపై స్థానికులు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. 80నుంచి 100అడుగుల రోడ్డు అని చెప్పినదానికి భిన్నంగా 55నుంచి 60అడుగులుగా నిర్ధారించి వెడల్పు చేయాలని నిర్ణయించిన దానికి భిన్నంగా 34అడుగుల్లోనే నిర్మాణాలు పూర్తిచేయడం ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇక మిగిలిన 25అడుగులకుపైగా రోడ్డు అభివృద్ధి పరిస్థితి ఏంటని నిలదీస్తున్నారు. ఖమ్మం పట్టణంలోనే అనేక దశాబ్దాల నాటి ప్రైవేట్ భవనాలను తొలగించి రోడ్లను వెడల్పు చేస్తుంటే వైరాలో మాత్రం కబ్జాలు, ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకొని వెడల్పుతో నిర్మాణాలు చేపట్టకుండా ఉదాసీన వైఖరిని ప్రదర్శించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



అమృత పథకంలో పైపులైన్ నిర్మాణానికి తవ్విన గోతులు, రోడ్డుపై పోసిన మట్టి